సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 138

పేజీలు: 08 | వెల: రూ.2:00

హైదరాబాద్ | శనివారం 16 మే 2026

Published from Hyderabad, Vijayawada.


## మేమంతా స్నేహితులుగా మారాం

- చైనా రావడం నాకు దక్కిన గౌరవం
- సెప్టెంబర్ 24న అమెరికాకు జిన్‌పింగ్
- పలు సమస్యలను పరిష్కరించుకున్నాం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- చైనాలో ముగిసిన డోనాల్డ్ ట్రంప్ పర్యటన



న్యూఢిల్లీ,మే15: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సెప్టెంబర్ 24 లేదా ఆ తరువాత అమెరికాను సందర్శించవచ్చని అమెరికా అధ్యక్షుడు మిగతా 5 లో..



## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

**రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి**
**అధికారులను ఆదేశించిన సీఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్,మే15(సాక్ష్యం): హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర మిగతా 2 లో..



## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

**సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు**
**రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి**

హైదరాబాద్,మే15(సాక్ష్యం): ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల మిగతా 2 లో..




## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

**పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్,మే15(సాక్ష్యం): పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవానికి, భద్రమైన భవిష్యత్తుకు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి మిగతా 2 లో..

## పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

- లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు
- ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం



న్యూఢిల్లీ,మే15(సాక్ష్యం): ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు మిగతా 5 లో..

# ఇంటిదొంగే.. సూత్రదారి

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఒక ప్రొఫెసర్‌ను పుణెలో కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) శుక్రవారం అరెస్టు చేసింది. 'మహారాష్ట్రలోని లాతూరు ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి రసాయన శాస్త్రంలో నిపుణుడు. ఆయన గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం పుణెలో నివసిస్తున్నారు. నీట్ ప్రశ్నపత్రాలను చూడడానికి ఆయనకు యాక్సెస్ ఉంది. అయినప్పటికీ ఆయన తన సొంత ఇంటిలోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు నిర్వహించినట్లు సీబీఐ దర్యాప్తులో తెలిసింది' అని సీబీఐ అధికారులు తెలిపారు.

- నీట్ పేపర్ లీక్ సూత్రధారి కులకర్ణి
- అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడు
- ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ
- పుణెలో అరెస్టు చేసిన సీబీఐ బృందం
- 2026 ఏప్రిల్ చివరి వారంలోనే ప్లాన్
- పెద్ద ఎత్తున విద్యార్థుల సమీకరణ






న్యూఢిల్లీ,మే15: నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ప్రొఫెసర్ పి.వి.కులకర్ణిని సీబీఐ అరెస్టు చేసింది. నిందితుడిని పుణెకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా గుర్తించిన అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తరఫున పరీక్ష ప్రక్రియలో కొన్నేళ్లుగా కులకర్ణి పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రశ్నపత్రాలను పొందే అవకాశం అతనికి దొరికింది. ఏప్రిల్ చివరి వారంలో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సహాయంతో నిందితుడు పేపర్ లీక్ కుట్రకు పాల్పడినట్లు సీబీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రలోని పుణెలో తన నివాసంలో ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులను కులకర్ణి నిర్వహించినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. మనీషా సహాయంతో పలువురు విద్యార్థులను సమీకరించి వారికి రహస్యంగా కోచింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాలను లీక్ చేసినట్లు ఆరోపించారు. ఈ తరగతుల్లోనే ప్రశ్నలు, సరైన జవాబులను విద్యార్థులకు చెప్పారని అధికారులు తెలిపారు. మిగతా 2 లో..

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

- జూన్ 21న ఎగ్జామ్ నిర్వహణ
- వివరాలు వెల్లడించిన ఎన్‌టిఎ
- వచ్చే ఏడాది నీట్ ఆన్‌లైన్ పరీక్ష
- లీకేజీని అరికట్టేందుకు చర్యలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ,మే15(సాక్ష్యం): ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో రద్దయిన నీట్ యూజీ 2026 పరీక్షను మళ్లీ నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. మిగతా 2 లో..

## ఉన్నావ్ దోషి కుల్దీప్ సింగ్‌కు ఎదురుదెబ్బ

- ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేసిన సుప్రీం
- మరోమారు పూర్తి విచారణ జరపాలని ఆదేశం

న్యూఢిల్లీ,మే15(సాక్ష్యం): ఉన్నావ్ అత్యాచారం కేసులో జీవితఖైదు పడిన భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సెంగర్ జైలు శిక్షను నిలిపివేస్తూ గతంలో దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని హైకోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. దిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ మిగతా 2 లో..

# మళ్లీ నేనే..

- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని
- ఆ తరువాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా
- రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా
- రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- సీఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు
- బండి సంజయ్ కుమారుడిని అప్పగించాలి
- నైతికత నిరూపణలకు ఇదే సమయం: రేవంత్

హైదరాబాద్,మే15(సాక్ష్యం): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగతా 5 లో..



# తెలంగాణ క్యాన్సర్‌పై అట్లాస్

## సిఎం రేవంత్‌కు అందించిన నోరి

### ఎంతో ఉపయుక్తమైన సమాచారమని సీఎం కితాబు

హైదరాబాద్,మే15(సాక్ష్యం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ ను అందజేసిన ప్రభుత్వ సలహాదారు , ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు నోరి దత్రాత్రేడు.. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్తూ . పాల్గొన్నారు. తెలంగాణలో క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర నివేదికను అందజేసిన నోరి దత్తాత్రేయుడిని అభినందించిన ముఖ్యమంత్రి. క్యాన్సర్‌పై పోరాటంలో నోరి దత్తాత్రేయుడు రూపొందించిన మిగతా 5 లో..

## తక్షణ ఉత్తర్వులు ఇవ్వలేం

- బండి సాయి భగీరథ్‌కు రాష్ట్ర హైకోర్టు షాక్
- మధ్యంతర రక్షణ కల్పించడానికి నిరాకరణ
- భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు
- పేట్‌బషీరాబాద్ పోక్సో కేసు పోలీసులు నమోదు
- బండి సంజయ్ పేరును ఎక్కడా వాడొద్దు
- హైదరాబాద్ సివిల్ కోర్టు సంచలన తీర్పు



హైదరాబాద్,మే15: బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు హైకోర్టులో ఎలాంటి తక్షణ ఊరట లభించలేదు. మైనర్ బాలికను లైంగికంగా వేధించినట్లు పేట్‌బషీరాబాద్ పోలీసులు నమోదు చేసిన పోక్సో కేసులో అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించడానికి హైకోర్టు నిరాకరించింది. బండి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేస్తున్నామని, ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. ఈ నెల 21న (గురువారం) ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తామని తెలిపింది. కనీసం ముందస్తు బెయిల్ పిటిషన్‌లో మిగతా 5 లో..

# సంపాదకీయం

## ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు !

ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను ప్రమాదంలో పడేసిన ట్రంప్ ఇంకా మేల్కొనలేదు. తనవల్ల ప్రపంచం అతలాకుతలం అయ్యిందే అన్న కించిత్ చింతన కూడా కానరావడం లేదు. పైపెచ్చు..ఇరాన్‌ను భూమండలం మీద లేకుండా చేస్తామని కూడా ప్రకటించారు. ఇరాన్ సంగతి ఎలా ఉన్నా...భారత్ లాంటి దేశాలు చమురు ధరలతో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం తప్పేట్లుగా లేదు. చమురు రవాణా ఆగిపోవడంతో పాటు, ముడి చమురు ధరలు పెరగడంతో నానాయాతన పడాల్సి వస్తోంది. తాజాగా భారత్‌లో పెట్రో, డీజిల్ దలరు పెరిగాయి. ఈ పెరుగుదల ఒక్క ఇంధనంపైనే ఉండదు. ఇకనుంచి అన్నిరంగాల పై దీని ప్రభావం పడుతుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయి. విమానయాన రంగం ఇప్పటికే గగనకుసుమమైంది. ఇది మరింత ప్రమాదంలో పడనుంది. వెరసి సామాన్యుల బతుకులు భారం కానున్నాయి. పొదుపు మంత్రం ప్రకటించిన ప్రధాని మోడీ కాన్వాయ్‌లను తగ్గించారే తప్ప, అసలు పొదుపు విషయంలో మాట్లాడడం లేదు. దేశంలో ప్రజాప్రతినిధుల దుబారాను తగ్గించే ప్రయత్నాలపై ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. దీనికితో తోడు ఈ సంక్షోభం దృష్ట్యా ఐటి కంపెనీల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ప్రధాని మోడీ ఇచ్చిన వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం అమలు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కరోనా సమయంలో విధిలేక ఆఫీసులు మూసుకున్న ఐటి కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితం చేయదల్చుకోలేదు. దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేసే విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, దేశీయ ఐటీ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌పై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రతిరోజూ సగటున 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల అటు ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా, భారీగా ఇంధనం ఖర్చవుతోంది. ప్రధాని సూచన మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో ఈ విధానం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. నగరంలోని మొత్తం ఐటీ ఉద్యోగులలో కనీసం సగం మంది, అంటే సుమారు 4.5 లక్షల మంది వారానికి కేవలం మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా అద్భుతమైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నెలకు దాదాపు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఇలా ఒక్కో నగరాన్ని తీసుకుంటే గణనీయమైన మార్పులు ఉంటాయని అంటున్నారు. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం విజయవంతంగా అమలు జరిగినప్పటికీ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తుండగా, కొన్ని చిన్న స్థాయి సంస్థలు మాత్రం ఈ విధానం వల్ల తమ ఉత్పాదకత దెబ్బతింటుందని లేదా ఇతర నష్టాలు వస్తాయని ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వస్తే తప్ప ఈ విషయంలో క్లారిటీ వచ్చేలా లేదు. కేవలం వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాకుండా, పెట్రోల్ , డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను
ప్రోత్సహించడం కూడా అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి నుండే పని చేయడం వల్ల ఇంధన దిగుమతులు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ పెరగడానికి తోడ్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం ఒక కీలక మలుపు కానుంది. ఇకపోతే ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ఐటి కంపెనీలు కుదింపు మోజులో పడ్డాయి. ఎడాపెడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించిన అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్.. తాజాగా మరో షాకిచ్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి పలు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పక్రియ ద్వారా విద్యార్థులకు జారీ చేసిన జాబ్ ఆఫర్ లెటర్లను, ప్రీ-ప్లేసమెంట్ ఆఫర్ల (పీపీఓ)ను కంపెనీ రద్దు చేసింది. ఒరాకిల్ తాజా నిర్ణయంతో ప్రభావితమైన కాలేజీల్లో ఎన్ఐటీ వరంగల్, వీఎన్ఐటీ నాగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ బీహెచ్‌యూ కూడా ఉన్నాయి. ఆఫర్ లెటర్ల రద్దు విషయాన్ని కంపెనీ ఈ వారంలోనే విద్యార్థులకు వెల్లడించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందుకంటే, చాలావరకు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రాంగణ నియామకాల విషయంలో ఒక విద్యార్థి- ఒక ఉద్యోగం విధానాన్ని అనుసరిస్తున్నాయి. అంటే, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పక్రియలో ఒక కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ అందుకున్న విద్యార్థికి ఇతర కంపెనీల ఆఫర్లను దక్కించుకునే అవకాశం ఉండదు. దాంతో ఒరాకిల్ ఆఫర్ కోల్పోయిన వారిప్పుడు కొత్త ఉద్యోగం కోసం అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికన్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన సిస్కో కూడా భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగా సిబ్బంది సంఖ్యను దాదాపు 4,000 మేర తగ్గించుకునే ఆలోచనలో ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ప్రభావిత సిబ్బందికి నేరుగా తెలియజేయడం జరుగుతుందని కంపెనీ పేర్కొంది. సిస్కో కూడా తన పెట్టుబడులను కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు వేగంగా వృద్ధి చెందుతున్న ఇతర విభాగాల వైపు పెట్టుబడులను మళ్లించే ప్రయత్నాల్లో ఉంది. మైక్రోసాఫ్ట్‌పరమైన వృత్తి నిపుణుల సోషల్ నెట్‌వర్కింగ్ ఎ÷-లాట్‌ఫామ్ లింక్డ్ఇన్ సైతం ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. వృద్ధి చెందుతున్న విభాగాలపై దృష్టిపెట్టేందుకు సిబ్బంది పునర్వ్యవస్థీకరించాలనుకుంటున్న కంపెనీ.. అందులో భాగంగా 5 శాతం ఉద్యోగాలకు కోత పెట్టాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లింక్డ్ఇన్‌లో ప్రపంచవ్యాప్తంగా 17,500 ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా ట్రంప్ పెట్టిన కుంపటి ఇప్పట్లో చల్లారేలా లేదు. ప్రపంచ ఆర్థిక స్థితిని ఎంతగా దిగజారుస్తుందో ఇప్పుడే చెప్పలేం. భారత్ ఆర్థిక వ్యవస్థపై మాత్రం తీవ్ర ప్రభావం పడడం ఖాయమని చెప్పవచ్చు.




## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి..

రేవంతరెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే పక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రిగారు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు అనసూయ సీతక్క, కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్, కడియం శ్రీహరి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు. 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా , ఐటిడిఎ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్దిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే , తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ, పోలీసు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారనీ , ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతులపై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు. ÷ఖ్యంగా ఈ నెలాఖరుకల్లా వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 2 బిహెచ్ కె ఇండ్లన్నిటికీ లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ పడకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకే లబ్ది చేకూరేలా చూడాలని స్పష్టం చేసారు. డబుల్ బెడ్ రూం కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, మంచినీరు, డ్రైనేజి వంటి వాటి పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న కాలనీల్లో టవర్ ను యూనిట్‌గా తీసుకుని , లబ్దిదారుల అసోసియేషన్ ల ద్వారా పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ÷ాష్ట్రంలో ప్రధానంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీభూములున్నాయని, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య చాలా సరిహద్దు వివాదాలు ఉన్నాయని మంత్రి అన్నారు. రెండు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దీంతో పాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్టు మధ్య కూడా వివాదాలు ఉన్నాయని ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన రోవర్స్ తో సర్వే నిర్వహించి భూ వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. సమావేశాల్లో హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిదొంగే.. సూత్రధారి

మొదటిపేజీ తరువాయి..



ఆ ప్రశ్నలు మే 3న నిర్వహించిన అసలు నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రాల్లో వచ్చాయని వెల్లడించారు. దీంతో మే 14న మనీషాను అరెస్టు చేయగా.. తాజాగా కులకర్ణిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, అహల్యానగర్ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఏడుగురిని సీబీఐ అరెస్టు చేసింది. వారిలో ఐదుగురిని ఇప్పటికే కోర్టులో హాజరుపర్చగా.. ఏడు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. గురువారం అరెస్టయిన మిగిలిన ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ రిమాండ్ నిమిత్తం పుణెలోని కోర్టులో హాజరుపరిచారు. తదుపరి విచారణ కోసం ఆ ఇద్దరినీ ఢిల్లీకి తరలించనున్నారు.

## నీట్ పరీక్ష కొత్త షెడ్యూల్ విడుదల

మొదటిపేజీ తరువాయి..

జూన్ 21న, ఆదివారం ఈ పరీక్ష జరగనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ మేరకు ఎన్‌టీఏ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. రీఎగ్జామ్‌కు సంబంధించి అధికారిక మార్గాల్లో వచ్చే సమాచారాన్నే విశ్వసించాలని విద్యార్థులను ఎన్‌టీఏ కోరింది. హాల్‌టికెట్, ఇతరత్రా వివరాలను త్వరలోనే వెల్లడించనుంది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్,



బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3వ తేదీన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష-యూజీని (నీట్-యూజీ) నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ పరీక్ష జరిగింది. అయితే, ఈ పరీక్ష ప్రశ్నపత్రాలు కొన్నిచోట్ల లీకయ్యాయని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నాటి పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 23 లక్షల మంది మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా.. రీఎగ్జామినేషన్‌కు మరోసారి దరఖాస్తు చేసుకోనక్కర్లేదని, ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఇదిలాఉండగా.. నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు కీలక నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. రాజస్థాన్‌లోని సికార్‌లో ఈ లీకేజీ వ్యవహారం బయటపడింది. సుమారు 410 ప్రశ్నలతో ఒక గెస్ పేపర్ పరీక్షకు ముందే విద్యార్థులకు అందగా.. అందులోని 120 కెమిస్ట్రీ ప్రశ్నలు పరీక్షలో వచ్చాయనే ఆరోపణలొచ్చాయి. ప్రశ్నల క్రమంతో పాటు ఆప్షన్లు కూడా ఒకే వరుసలో ఉండటంతో లీక్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రశ్నపత్నం లీక్ అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచి రాజస్థాన్, హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ సహా పలు రాష్ట్రాలకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ పేపర్ కోసం విద్యార్థుల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నాం అని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు ఆందోళన చెందొద్దని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు. హైదరాబాద్, పూనే,ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ - బెంగళూరు కారిడార్, హైదరాబాద్- చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఊఓఆం మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

మొదటిపేజీ తరువాయి..

అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## ఉన్నావ్ దోషి కుల్దీప్ సింగ్‌కు ఎదురుదెబ్బ

మొదటిపేజీ తరువాయి..

సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తనను దోషిగా తేల్చడం, యావజ్జీవ కారాగార శిక్ష విధించడంపై సెంగర్ వేసిన అప్పీల్‌ను రెండు నెలల్లోగా పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. ఒకవేళ దోషిగా తేల్చడంపై నిర్ణయం తీసుకోలేకపోతే.. యావజ్జీవ శిక్షను నిలిపివేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌పైనైనా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపింది. ఈ కేసు అర్హతలపై తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని, హైకోర్టు కొత్తగా విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. పోక్సో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యేను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించవచ్చా, లేదా అనే అంశాన్ని కూడా పునఃపరిశీలించాలని సీజేఐ హైకోర్టుకు సూచించారు. 2017లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డారని కుల్దీప్ సింగ్ సెంగర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. దీనిపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. సెంగర్‌ను దోషిగా తేలుస్తూ జీవితఖైదు విధించింది. ఆ తర్వాత సుప్రీం ఆదేశాలతో ఈ కేసు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి దిల్లీ హైకోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై గతేడాది చివర్లో విచారణ జరిపిన దిల్లీ హైకోర్టు సెంగర్ శిక్షను నిలిపివేస్తూ తీర్పు వెలువరించింది.

## పొదుపు చర్యల్లో టిడిపి మరో అడుగు

### మహానాడును వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయం
### నెల్లూరు వేదికగా నిర్వహించాలనుకున్న మహానాడు రద్దు
### మంగళగిరి పార్టీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు
### వర్చువల్గా జిల్లా పార్టీ కార్యాలయాలద్వారా ప్రసారం

అమరావతి,మే15: పొదుపు చర్యల్లో భాగంగా తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మహానాడును ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో వేదిక ఏర్పాటు చేసి నిర్వహించాలని పార్టీ నేతలకు సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో పార్టీ శ్రేణుల కోసం ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించాలని తొలుత నిర్ణయించి ఏర్పాట్లు ప్రారంభించారు. పొదుపు చర్యల్లో భాగంగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 27, 28న మహానాడు జరగనున్న సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై పార్టీ హై కమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించాలని భావించిన మహానాడును ఇప్పుడు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మహానాడు కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. భారీ జన సమీకరణకు బదులుగా సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను అనుసంధానించే విధంగా ఈసారి మహానాడును నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ చరిత్రలో హైబ్రిడ్ విధానంలో మహానాడు నిర్వహణకు తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. పార్టీ కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచుతూ, సమర్థవంతమైన నిర్వహణకు ఈ విధానం ఉపయోగపడుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలో నేతలు ప్రత్యక్షంగా పాల్గొనగా, జిల్లాలు, నియోజకవర్గాలు, క్లస్టర్ల స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వర్చువల్ విధానంలో హాజరుకానున్నారు. మంగళగిరిలో జరిగే మహానాడుకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రత్యక్షంగా హాజరవుతారు. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, ముఖ్య నాయకులు తమ తమ నియోజకవర్గాల నుంచి ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీకి చెందిన 1848 క్లస్టర్ల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కూడా ఆయా క్లస్టర్ల నుంచే వర్చువల్‌గా మహానాడులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఒకేసారి మహానాడును వీక్షించేలా సాంకేతిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మహానాడులో ప్రవేశపెట్టే రాజకీయ, ఆర్థిక, సంక్షేమ తీర్మానాలు సహా అన్ని కార్యక్రమాలు సంప్రదాయ మహానాడు తరహాలోనే నిర్వహించనున్నట్లు టీడీపీ నేతలు వెల్లడించారు. తీర్మానాల ఆమోదం, నాయకుల ప్రసంగాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు అన్నీ హైబ్రిడ్ మోడల్‌లో కొనసాగనున్నాయి. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ విధానాలపై చర్చ, భవిష్యత్తు రాజకీయ వ్యూహాల రూపకల్పన వంటి అంశాలు ఈ మహానాడులో ప్రధాన అజెండాగా ఉండనున్నాయి.

## ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలం

**ఒంటరి పోరాటం చేసి దెబ్బతిన్న విషయం మరవద్దు**

**పార్టీ శ్రేణులతో జనసేనాని పవన్ కళ్యాణ్**

**పార్టీ సభ్యత్వం అంటే జనసేన ఆశయాలకు అద్దం**

**ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాల లక్ష్యం**

**పార్టీ కార్యకర్తల స్వేదం మరచిపోలేనిది**

**పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్**

అమరావతి,మే15: ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పక్క రాష్ట్రంలో ఒకరు పార్టీ పెట్టి సీఎం అయ్యారని, తాను కూడా అలా వెళ్తే బాగుండేదని అనేక మంది సలహాలు ఇస్తున్నారని.. కానీ ఏపీలో పరిస్థితులు వేరనే విషయాన్ని వాళ్లు తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో 'జనసేన ఉద్యమ ఆత్మీయ సమావేశం' నిర్వహించారు. ఈ సమావేశానికి పవన్ హాజరై మాట్లాడారు. ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నాం.. నేనూ రెండు చోట్లా ఓడిపోయా. జనసేన పార్టీకి మూలస్తంభం కార్యకర్తలే. కుటుంబం నడిపే పార్టీగా ఉండకూడదని కోరుకుంటున్నానని పవన్ అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు సీఎం విజయ్‌తో పోల్చి తనను వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై పవన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దశాబ్దం కాలం పాటు నలిగిపోయి, ఫ్యాక్షన్ రాజకీయాలు తట్టుకుని ఇక్కడి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు. ఈ మధ్యన పక్క రాష్ట్రంలో ఒక వ్యక్తి పార్టీ పెట్టి సీఎం అవగానే తనతో పోలిక పెట్టారని తెలిపారు. ఊర్లో పెళ్లికి ఏదో హడావుడి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మన ఊర్లో పెళ్లి జరుగుతుంటే. చిన్నపిల్లలు పరుగులు పెడుతుంటారని.. అలా ఉంది వారి



ప్రచారమని ఎద్దేవా చేశారు. ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులు వేరని.. అక్కడి పరిస్థితులు వేరని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 2019లో తాను పోటీ చేస్తే రెండు చోట్లా ఓడించారని.. దీంతో తనతో ఉన్న నాయకులు వెళ్లిపోయారని ప్రస్తావించారు. పొంతన లేని పోలికలు పెట్టి.. ప్రచారం చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. కమ్యూనిస్టులు పార్టీ పెట్టి ఎన్నో దెబ్బలు తిని నిలబడ్డారని ప్రస్తావించారు. అదేవిధంగా ఒక రాజకీయ పార్టీ నడపడం అంటే అంత ఈజీ కాదని తెలిపారు. 2007 నుంచి 2018 వరకు దశాబ్దం పాటు తాను ఇబ్బంది పడ్డానని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. దెబ్బతినకుండా ఏదీ రాదని.. 2024కి అధికారంలో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. ఈరోజున అందరూ తనను వదిలేసినా.. తాను పార్టీని ముందుకు తీసుకెళ్తున్నానని స్పష్టం చేశారు. కార్యకర్తల నుంచి బలమైన నాయకత్వం తనకు రావాలని కోరుతున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కేవలం ఒక సంఖ్య కాదని, అది పార్టీ విలువలను, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఒక గొప్ప యజ్ఞమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, జనసైనికులను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని, పార్టీ ఇస్తున్న భరోసాను ఆయన వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై నాదెండ్ల మనోహర్ కీలక గణాంకాలను వెల్లడించారు. 2024 ఎన్నికల తర్వాత జనసైనికులు ఎంతో బలంగా నిలబడి 12 లక్షల 12 వేల సభ్యత్వాలు చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకోగా, క్షేత్రస్థాయిలో జనసైనికుల కృషి వల్ల ఇప్పటికే 21 లక్షల 50 వేల సభ్యత్వాలు పూర్తి కావడం విశేషమని ఆయన కొనియాడారు. ఏటా సభ్యత్వాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని చెప్పారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మనోహర్ భరోసా ఇచ్చారు. 2020లో సభ్యత్వ నమోదు ప్రారంభించినప్పటి నుండి దురదృష్టవశాత్తూ 1,034 మంది జనసైనికులు ప్రాణాలు కోల్పోయారు. పార్టీ సభ్యత్వం ఉండి మరణించిన వారందరికీ కలిపి ఇప్పటి వరకు రూ. 46 కోట్ల 35 లక్షలను చెక్కుల రూపంలో వారి కుటుంబాలకు అందజేశాం అని ఆయన వివరించారు. రాజకీయాల్లో కష్టాలు, సమస్యలు సహజమని, కానీ జనసేన ఎప్పుడూ తన సిద్ధాంతాలకు కట్టుబడే ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. పార్టీలో వర్గాలు లేదా భిన్న నాయకత్వాలు ఉన్నాయని వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. జనసేనలో ఎలాంటి వర్గాలు లేవు. మనందరికీ ఉన్నది పవన్ కళ్యాణ్ నాయకత్వం ఒక్కటే. నిజాలు తెలుసుకోకుండా ఎవరూ తొందరపడి మాట్లాడవద్దని సూచించారు. పార్టీ కోసం వీరమహిళలు, జనసైనికులు ఎంతో ధైర్యంగా నిలబడ్డారని, వారి కష్టానికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసైనికులు ఒక అవకాశంగా తీసుకోవాలని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మన ముందు ఉందని, పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడమే మన లక్ష్యం కావాలని కోరారు. ఏ రోజూ స్వార్థం కోసం పని చేయని జనసైనికుల కృషితో పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గిరిజన ఆర్థిక స్వావలంబనకు ఇప్ప పువ్వు ప్రాజెక్ట్

### గిరిజనుల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం
### అడవిని ఆదాయ వనరుగా మార్చే దిశగా ముందడుగు
### గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్,మే15(సాక్ష్యం): గిరిజన ప్రాంతాల్లో సంప్రదాయ జీవన విధానానికి ఆధారమైన ఇప్ప పువ్వును గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రధాన వనరుగా మలిచే దిశగా



తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 'మహువా ఫ్లవర్ ప్రాజెక్ట్ అమలు'పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క,రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... గిరిజన ఆదివాసీ మహిళలు, రైతులు, యువత, ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. అడవుల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు గిరిజన సంస్కృతి, ఆహార సంప్రదాయాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుతం ఇప్ప పువ్వును కేవలం సంప్రదాయ వినియోగానికి మాత్రమే పరిమితం కాకుండా, ఆహార ఉత్పత్తులు, ఔషధ వినియోగాలు, విలువ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధికి ఉపయోగించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో శాస్త్రీయ సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసి గిరిజన కుటుంబాలకు స్థిరమైన ఆదాయం అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా గిరిజన మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, యువజన సమాఖ్యలను ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం చేసి గ్రామీణ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అటవీ సంపదపై గిరిజనుల హక్కులను పరిరక్షిస్తూ, అదే సమయంలో వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సమగ్ర విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, పోషకాహార భద్రత, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఇప్ప పువ్వు ఆధారిత ప్రాజెక్టులను రూపొందిస్తున్నామని మంత్రి వెల్లడించారు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి అడవి ఉత్పత్తుల విలువను పెంచడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని పనిచేస్తోందని మంత్రి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సహజ వనరుల ఆధారంగా స్థిరమైన ఉపాధి అవకాశాలు సృష్టించి యువత వలసలను తగ్గించడం, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలతో అలాగే ప్రభుత్వ యంత్రాంగం ఉమ్మడిగా సమన్వయంతో పైలట్ ప్రాజెక్టులు చేపట్టి, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. గిరిజన సంపద గిరిజనులకే లాభదాయకంగా మారే విధంగా పారదర్శక విధానాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క గారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సహజసిద్ధంగా లభించే ఇప్ప పువ్వు కేవలం అటవీ ఉత్పత్తి మాత్రమే కాకుండా గిరిజన కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు బలమైన ఆధారంగా మారే సామర్థ్యం కలిగి ఉందన్నారు. ఇప్ప పువ్వు నుండి లడ్డూలు, నాచురల్ హెల్త్ ఫుడ్స్, సంప్రదాయ ఆహార పదార్థాలు తయారు చేయవచ్చని, ఇప్ప గింజల నుండి నూనె తయారీకి కూడా విశేష అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇప్ప ఆకులు, పువ్వులు, గింజలు అన్నీ వినియోగంలోకి తీసుకువస్తే గిరిజన ప్రాంతాల్లో చిన్న స్థాయి పరిశ్రమలు ఏర్పడి మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఇప్ప పువ్వుతో పోషకాహార పదార్థాలు, పిల్లలకు ఆరోగ్యకరమైన స్నాక్స్, మి÷-లలెట్ ఆధారిత ఫుడ్ ప్రొడక్ట్స్, హర్బల్ టీలు, నాచురల్ స్వీటెనర్లు తయారు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో మహిళా సంఘాలకు శిక్షణ ఇచ్చి 'ట్రైబల్ నాచురల్ ఫుడ్ బ్రాండ్స్' రూపంలో మార్కెట్‌లోకి తీసుకురావాలని సూచించారు. గిరిజన మహిళల సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేస్తే ప్రపంచ మార్కెట్‌లో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావచ్చని సీతక్క పేర్కొన్నారు. ప్రతి గిరిజన గ్రామంలో ఇప్ప పువ్వు సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్‌కు మినీ యూనిట్లు ఏర్పాటు చేయాలని, యువతను స్టార్టప్ రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. ఇప్ప పువ్వు ఆధారిత ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఈ-కామర్స్ మార్కెటింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకోవాలని తెలిపారు. గిరిజన మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, ప్రభుత్వ సబ్సిడీలు, స్వయం ఉపాధి పథకాలను అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకట రామయ్య చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ విశేషంగా ఆకట్టుకుంది. ఇప్ప పువ్వును కేవలం అటవీ ఉత్పత్తిగా కాకుండా గిరిజన ఆర్థిక స్వావలంబనకు ఆధారంగా మలిస్తే గ్రామీణాభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.

సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి , మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గిరిజన ఎమ్మెల్యేలు రామచంద్ర నాయక్,మురళి నాయక్ లతో ÷ూటు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బి.ఎల్. సంతోష్, భద్రాచలం పి.ఓ రాహుల్, ఉట్నూర్ పి.ఓ మంద మకరందు, ఏటూరునాగారం పి.ఓ లెనిన్ వత్సాల్ టొప్పో .పలువురు ప్రముఖ ప్రొఫెసర్లు, నిపుణులు చంద్ర రామారావు పాల్గొన్నారు .

### ఆగివున్న లారీని ఢీకొన్న కారు

చిత్తూరు,మే15: జిల్లాలోని పూతలపట్టు మండలం పి.కొత్తకోట రైల్వే బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలుకోల్పోయారు. ఆగి ఉన్న లారీని ఓ కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


Development Commissioner for Handlooms
Govt. of India, New Delhi

SILK MARK

STATE LEVEL HANDLOOM EXHIBITION - 2026

EXHIBITION CUM SALE OF PURE HANDLOOM PRODUCTS

ENCOURAGE HANDLOOMS BY WEARING

From 8th May 2026 to 17th May 2026

EVERY DAY 10 AM to 10 PM

Exclusive Collection of Banarasi | West Bengal Boutique Items | Tassar Kantha & Printed | Chanderi / Maheshwari | Kota | Rajkot Patola | Pochampally Ikkat | Bengaluru Pure Crape Silks | Bihar & Jharkhand Tassar Dress Materials | Gadwal | Kalamkari | Kanchipuram | Paithani Sarees | Venkatagiri / Uppada Jamdhani Sarees and Cotton Dress Materials | Bed linens | Jewellery.

Venue: Sathya Sai Nigamagamam, Srinagar Colony, Hyderabad

ENTRY FREE... ALL ARE WELCOME

ONLINE PAYMENTS ALSO ACCEPTED

Our Courtesy:
Development Commissioner for Handlooms, Ministry of Textiles, Govt. of India, New Delhi.

Organised by :
Commissioner of Handlooms & Textiles, Telangana, Hyderabad.

To wearing handloom clothes is a symbol of Indian culture... That is Respectable

## ప్రజలకు చేరువగా ప్రత్యేక పీజీఆర్ఎస్

**ఒక నెల-ఒక గ్రామం-నాలుగు సందర్శనలు కార్యక్రమం**

**ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రణాళిక**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,మే15: ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని, వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం మైలవరం నియోజకవర్గం, జి.కొండూరు మండలం, కుంటముక్కల గ్రామంలో ప్రత్యేక



పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు ఒక నెల–ఒక గ్రామం–నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి, నిర్దిష్ట గడువులో పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రెవెన్యూకు సంబంధించి మొత్తం 61 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా పంచాయతీరాజ్‌కు 9, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖలకు మూడు చొప్పున, మత్స్య శాఖకు రెండు అర్జీలు వచ్చాయి. డీఆర్‌డీఏ, పౌర సరఫరాలు, కార్మిక, పోలీసు, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. మొత్తం 83 అర్జీలు రాగా.. ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించి సమస్యలకు సత్వర, నాణ్యమైన పరిష్కారాలను చూపాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఇలాంటి కార్యక్రమాల ద్వారా కలుగుతుందని, భూ సమస్యలు, పింఛన్లు, రేషన్, తాగునీరు, విద్యుత్, గృహాలు, ఉపాధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సమన్వయ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

మెరుపు దాడుల్లో భారీమొత్తంలో బియ్యం స్వాధీనం

అంబేద్కర్ కోనసీమ,మే15:
జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం మాఫియాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలోని అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో పోలీసులు ఏకకాలంలో నిర్వహించిన మెరుపు దాడుల్లో భారీ మొత్తంలో అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జిల్లాలో మరోసారి రేషన్ మాఫియా కార్యకలాపాలపై చర్చకు దారితీసింది. పోలీసుల వివరాల ప్రకారం.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బొలెరో వాహనాల్లో తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. అంబాజీపేటలో పట్టుబడిన ఒక బొలెరో వాహనంలో 44 బస్తాల రేషన్ బియ్యం లభించింది. మొత్తం సుమారు 2,200 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ బియ్యం మలికిపురం, రాజోలు ప్రాంతాల నుంచి ఆలమూరు వైపు తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఇక రెండు వాహనాల్లో కలిపి మొత్తం 50 కిలోల చొప్పున 79 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు పి.గన్నవరం సీఐ భీమరాజు తెలిపారు. ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి లాభాలు ఆర్జిస్తున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలో ఇటువంటి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కోనసీమ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది.

## బాబాయే కీచకుడయ్యాడు

**ఇంటికి చ్చిన బాలికపై పలుమార్లు అత్యాచారం**

**కేసు నమోదు చేసిన పోలీసులు..నిందితుడి కోసం గాలింపు**

తిరుపతి,మే15: కాపాడాల్సిన బాబాయే కీచకుడయ్యాడు. కన్న బిడ్డలా చూసుకోవాల్సిన బాలికపై కామంతో కన్నేశాడు. పర్సనల్ ఫోటోలను అడ్డుపెట్టుకుని.. సోషల్ మీడియాలో షేర్ చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేసి దారుణానికి ఒడిగట్టాడు. తిరుపతిలో జరిగిన ఈ ఘోరం బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. నిందితుడు రామమూర్తిపై అత్యాచారంతో పాటు ఫోక్సో చట్టం కింద పోలీసులు వేట మొదలు పెట్టారు. సెలవులకని తన ఇంటికి వచ్చిన కూతురు వరుస అయ్యే బాలికపై కన్నేసి కామాంధుడిలా ప్రవర్తించాడు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ పరిధిలోని ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఏప్రిల్ నెలలో వేసవి సెలవుల కోసం తిరుపతిలోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్ళింది. అక్కడ పిన్ని భర్త రామమూర్తి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆమె ఫోన్లో ఉన్న కొన్ని వ్యక్తిగత ఫోటోలను చూసిన నిందితుడు.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఈ ఫోటోలను అడ్డుపెట్టుకుని భయపెడుతూ బాధితురాలిపై రామమూర్తి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్ళిపోయినా ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేయడం మానలేదు. పరీక్షలు రాసేందుకు హైదరాబాద్ వచ్చిన బాలిక మానసికంగా కృంగిపోవడాన్ని గమనించిన తల్లి.. నిలదీయగా అసలు విషయం బయటపడింది. బాబాయే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసి తల్లి షాక్ తిన్నది. వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలం తిరుపతి కావడంతో 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. అనంతరం కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. తిరుపతి పోలీసులు నిందితుడు రామమూర్తిపై కఠిన సెక్షన్లు నమోదు చేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండగా.. పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

# దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ధి

**రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్**

**ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారింది**

**జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి**

**అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన**

**దేశ అభివృద్ధిలో ఇక ఏపీ కీలక భూమి అన్న చంద్రబాబు**




పుట్టపర్తి,మే15:
దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారుకాబోతందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు.రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు.
ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుం దన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు పైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప స్టీల్‌ప÷–లాంట్‌ను పూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ద్వారా భారతదేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకో సిస్టమ్‌కు శ్రీకారం చుట్టాం. రూ.686 కోట్లతో 8 సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానోక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపు రేఖలు పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలను మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. ఆయన శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో రాయలసీమ రూపు రేఖలు మారబోతున్నాయి. రాయలసీమను మళ్లీ రతనాలసీమ చేసే బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. కడప స్టీల్‌ప్లాంట్ పనులు జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోలు, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తాం. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని సీఎం అన్నారు.

## యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్

రక్షణ రంగంలో భారత్ స్వావలంబన దిశగా పురోగతి

పుట్టపర్తి పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

పుట్టపర్తి,మే15: యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్ అని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యానించారు. ఆర్థిక, వ్యవసాయ శాఖల్లో డ్రోన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఏపీలో రూ.480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. శుక్రవారం పుట్టపర్తిలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం చంద్రబాబు పర్యటించారు. పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు




శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్లతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. పుట్టపర్తి – కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో డిఫెన్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు.
ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆయుధ ఉత్పత్తిలో స్వావలంబన దిశగా భారత్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. రక్షణ శాఖలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనేది కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరం తగ్గించడానికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు ఉంటుందని స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామన్నారు. 'యుద్ధ రంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఇక నుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారు. ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారింది. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీ రంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. కొన్నేళ్ల క్రితం రక్షణరంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయి. 2004లో కేవలం భారత్ రూ.46వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాల తయారీ ఉండేది. ప్రస్తుతం రికార్డు స్థాయిలో రూ.1.75లక్షల కోట్లకు చేరిందని గర్వంగా చెబుతున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు

ప్రధాని మోడీకి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు

అమరావతి,మే15: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ / ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్... పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు – సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది' అంటూ ఎక్స్‌లో పవన్ కళ్యాణ్ పోస్ట్ చేశారు.

## ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు

**అలజడులు సృష్టిస్తున్న వైసిపి అల్లరిమూకలు**

**చిల్లర విషయలతో ఆందోళనలతో అరాచకం**

**నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఘాటు విమర్శలు**

కర్నూలు,మే15:
వైసీపీ నేతలపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కర్నూలులో వైసీపీ నేతల ఆందోళనలపై స్పందించారు. రౌడీ మూకల గురించి మాట్లాడాల్సిన అవసరం లేకపోయినా ప్రజాప్రతినిధిగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. వైసీపీ నాయకులు చిల్లర ఇష్యూలను పట్టుకొని అల్లరి మూకలతో అలజడులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కర్నూలులో గురువారం జరిగిన వైసీపీ ఆందోళనలో సగం మందికి పైగా గంజాయి బ్యాచ్, క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన వారే పాల్గొన్నారని తెలిపారు. ఎస్వీ మోహన్ రెడ్డి స్క్రాప్ మనుషులతో



మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. బాలు అనే వ్యక్తి అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దోచుకున్నాడని తెలిపారు. పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే వైసీపీ నాయకులు ఇలాంటి వారి కోసం ఆందోళనలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మంత్రిపై ఏవేవో మాట్లాడుతున్నారని బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వ్యాపారాలు చేసి కష్టపడి సంపాదించడం తప్పా అని ప్రశ్నించారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చారని వైసీపీ నేత అంటున్నారని.. జగన్ తండ్రి పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదా అని ప్రశ్నించారు. గంజాయి బ్యాచ్‌పై నిఘా పెడతామని స్పష్టం చేశారు. ముచ్చుమర్రిలో మైనర్ బాలికను అత్యాచారం చేసి చంపిన వాళ్లు వైసీపీ కార్యకర్తలే అంటూ ఆరోపించారు. బాలికను చంపిన వారిని వైసీపీ నేతలు పరామర్శించి.. తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా తాను శవ రాజకీయం చేయలేదన్నారు. బాలిక శవం కోసం 5 రోజులు గాలించామని.. అప్పుడు వైసీపీ నేతలంతా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. వైసీపీ నేతలు కాదు...రాక్షసులంటూ విరుచుకుపడ్డారు. రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా.. తాను సిద్ధం అంటూ ఎంపీ సవాల్ విసిరారు. 'అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి వీడియోలు తీసి బెదిరిస్తుంటే పోలీసులు స్పందించడం తప్పా. పోలీసులను లాక్కొచ్చి పనిష్మెంట్ ఇస్తారట.. పోలీసులు అంటే ఏమనుకుంటున్నారు. టీడీపీ ఎవరినీ వదలదు.. మేము తప్పుచేసినా యాక్షన్ తీసుకుంటారు. భూకబ్జాలు చేశారంటున్న వాళ్లు ఆధారాలతో ఎందుకు ముందుకు రాలేదు' అని ఎంపీ బైరెడ్డి శబరి ప్రశ్నించారు.

## ధరల పెంపుపై భగ్గుమన్న కాంగ్రెస్

### ఇక సైకిలే దిక్కన్న అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ,మే15(సాక్షి): దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రూ.3 చొప్పున పెంచుతూ ఆయిల్ కంపెనీలు కీలక నిర్ణయం తీసుకోవడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఘాటు విమర్శలు చేసింది. 'ద్రవ్యోల్బణ వ్యక్తి మోదీ. మరోసారి ప్రజలపై కొరడా ఝుళిపించారు' అంటూ కాంగ్రెస్ తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు చేసింది. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరల పెంపును ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికలకు ముడిపెట్టింది. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించింది. ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయన్నది ఊహించినదే అంటూ తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్‌పై విలువ ఆధారిత పన్ను తగ్గిస్తుందా అంటూ పశ్చిమబెంగాల్‌లో కొత్తగా కొలువుదీరిన భాజపా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కేంద్రం ఇంధన ధరలు పెంచడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ వ్యంగ్యంగా స్పందించారు. 'మీరు ముందుకుసాగాలంటే.. సైకిల్ ఒక్కటే ఆప్షన్' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి సైకిల్ తొక్కుతూ ఉన్న క్యారికేచర్‌ను పంచుకున్నారు. 'సైకిల్ పైనే ప్రయాణం కొనసాగిస్తామని ఇదివరకే చెప్పాం' అని దానికి ఆయన క్యాప్షన్ పెట్టారు. కాగా.. సమాజ్‌వాదీ పార్టీ గుర్తు సైకిల్ కావడం గమనార్హం. ఇక, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దీంతో ప్రభుత్వరంగ చమురు కంపెనీలపై ఆర్థిక ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. ఈక్రమంలోనే లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి.

## పెట్రో ధరల పెంపు అనివార్యం

### కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు
### మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,మే15(సాక్షి): పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్యమైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## బండి భగీరథ ఫోక్సో కేసు

### సోషల్ మీడియాలో బాధిత బాలిక వివరాల ప్రచారం
### గోప్యతకు భంగం కలిగించడంపై పోలీసుల కేసులు

హైదరాబాద్,మే15(సాక్షి): బండి భగీరథ్ పోక్సో కేసు మరో కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రుల ఫోటోలు, వీడియోలు వైరల్ చేసిన సోషల్ మిడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లోని కొన్ని ఛానళ్లు బాధిత కుటుంబం వివరాలు బహిర్గతమయ్యేలా ఫోటోలు, వీడియోలు ప్రసారం చేశాయి. ఇవి వైరల్‌గా మారడంతో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలిక, ఆమె కుటుంబ వివరాలు బయటపెట్టిన వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి సంబంధిత యూఆర్ఎల్‌లను ఉన్నతాధికారులకు పంపించారు. ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకునేందుకు రంగంలోకి దిగారు. బాధితురాలి గోప్యతకు భంగం కలిగిస్తే శిక్ష తప్పదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి పోస్టులను షేర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ప్రధాని పొదుపు సూత్రంలో సుప్రీం

న్యూఢిల్లీ,మే15(సాక్షి): పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు సోమ, శుక్రవారం పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది. కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్ ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్-ఫ్రం-హోమ్‌కు అనుమతించాలని సూచించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని, అనవసర ఖర్చులు తగ్గించుకోవాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు.

# తెలంగాణ క్యాన్సర్‌పై అట్లాస్

మొదటిపేజీ తరువాయి..

అట్లాస్ ఎంతో ఉపయోగకరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వాటి కారణాలను అన్వేషించే అవకాశం ఈ నివేదిక ద్వారా లభిస్తుందన్నారు. నివేదికలో అందించిన డేటా ఆధారంగా క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు.

# మళ్లీ నేనే..



మొదటిపేజీ తరువాయి..

వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ పారిపోవడం తప్పు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత తీసుకుని కుమారుడిని అప్పగించాలని.. అలా చేస్తే ఆయన గౌరవం పెరుగుతుందని తెలిపారు. ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని.. పారిపోతే సమస్యలకు పరిష్కారం దొరకదని చెప్పారు.

బండి సంజయ్ కింది నుంచి కష్టపడి పైస్థాయికి వచ్చారని.. కుమారుడి కారణంగా ఆయనకు తలవంపులు వచ్చాయని సీఎం అన్నారు. తప్పయినా.. ఒప్పయినా ఆయన నిలబడి సమాధానం చెప్పాలన్నారు. తక్షణమే కుమారుడిని పీఎస్‌లో అప్పగించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ కేసులో ఎవరిది తప్పనే విషయాన్ని విచారణ అధికారులు తేలుస్తారన్నారు.

## తక్షణ ఉత్తర్వులు ఇవ్వలేం

మొదటిపేజీ తరువాయి..

తీర్పు ఇచ్చేవరకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని, పోలీసులకు అన్నివిధాలా సహకరించేందుకు సిద్ధమని భగీరథ్ తరపు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ దశలో ఇప్పటికిప్పుడు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. బండి భగీరథ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి ధర్మాసనం శుక్రవారం అర్ధరాత్రి వరకు విచారణ చేపట్టి తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. అంతకుముందు పిటిషనర్ భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది, వైసీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు కొనసాగించారు. 'వాస్తవానికి బాలిక తల్లిదండ్రులు అన్నిరకాలుగా న్యాయసలహా తీసుకున్న తర్వాత పూర్తిస్థాయిలో న్యాయనిపుణల సలహా మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , ఆయన కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన వ్యవహారంలో హైదరాబాద్ సివిల్ కోర్టు గ్యాగ్ ఆర్డర్ జారీ చేసింది. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెల్స్‌లో బండి సంజయ్ ప్రతిష్టకు భంగం కలిగించేలా సాగుతున్న ప్రచారంపై న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఈ కేసులో మంత్రి పేరును గానీ, ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఏ విధమైన సమాచారాన్ని గానీ ప్రసారం చేయకూడదని అన్ని మాధ్యమాలను ఆదేశించింది.న్యాయస్థానం జారీ చేసిన ఈ ఉత్తర్వు కేవలం ప్రధాన మీడియాకే కాకుండా.. ఫేస్‌బుక్ , ఎక్స్ , ఇన్‌స్టాగ్రామ్ , వాట్సాప్ , యూట్యూబ్ వంటి అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు వర్తిస్తుంది. బండి సంజయ్ కుమారుడికి సంబంధించిన కేసు సాకుతో మంత్రిని వ్యక్తిగతంగా దూషించడం, అసభ్యకరమైన పోస్టులు పెట్టడం లేదా అభ్యంతరకర కంటెంట్‌ను సర్క్యులేట్ చేయడం వంటివి తక్షణమే నిలిపివేయాలని కోర్టు స్పష్టం చేసింది.కేవలం భవిష్యత్తు ప్రసారాలనే కాకుండా, ఇప్పటికే వివిధ డిజిటల్ మాధ్యమాల్లో ఉన్న ఆధారాలు లేని ఆరోపణలు చేసే కంటెంట్‌ను కూడా వెంటనే తొలగించాలని కోర్టు ఆదేశించింది. మీడియా ట్రయల్స్, సంచలనాత్మక వార్తల వల్ల న్యాయ ప్రక్రియకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఈ బ్లాంకెట్ ఇంజంక్షన్ ఇచ్చినట్లు న్యాయస్థానం పేర్కొంది. ఒక వ్యక్తి ప్రైవసీ, గౌరవాన్ని కాపాడటం న్యాయ వ్యవస్థ బాధ్యతని ఈ సందర్భంగా కోర్టు గుర్తు చేసింది. కోర్టు ఆర్డర్‌లో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే.. బండి భగీరథ్ కేసుకు సంబంధించి ఏ రూపంలోనూ బండి సంజయ్ కుమార్ పేరును ప్రస్తావించకూడదని న్యాయమూర్తి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను ఎవరైనా బేఖాతరు చేసినా, ఉల్లంఘించినా వారిపై కోర్టు ధిక్కారం కింద కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. న్యాయ వ్యవస్థను , ఒక ప్రజా ప్రతినిధి గౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదని కోర్టు అభిప్రాయపడింది.

# పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాల్సిందే

### ఆందోళనలకు సిద్ధం అవుతున్న బిఆర్ఎస్ నేతలు
### నర్లపూర్ నుంచి ఉదండాపూర్ వరకు పాదయాత్ర
### బీఆర్ఎస్ మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

మహబూబ్‌నగర్,మే15(సాక్షి): పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. చేయాలని నర్లపూర్ నుంచి ఉదండాపూర్ వరకు పాదయాత్ర చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని వెల్లడించారు. కేసీఆర్‌ను కలిసి పాదయాత్ర పై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని, జూన్ నెలలోనే పాదయాత్ర



ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రైతాంగాన్ని, జిల్లా ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నివాసంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. మహబూబ్ నగర్ జిల్లా అత్యధికంగా వలస పోయిన జిల్లా. సాగునీరు ఇస్తే వలసలు తగ్గుతాయాని భావించి బీఆర్ఎస్ హయాంలో పాలమూరు ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసి 90 శాతం పనులు పూర్తి చేశాం. పది శాతం పనులు పూర్తి చేస్తే రైతులకు సాగునీరు అందుతుంది. కానీ ఇప్పటికి మోటార్లు ఆన్ చేయడం లేదు. పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నరేందర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, మర్రి జనార్ధన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, వాణి దేవి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఆంజనేయులు గౌడ్, వాల్య నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, ఇంతియాజ్, బీఆర్ఎస్ గద్వాల ఇన్‌ఛార్జ్ హనుమంతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.పాలమూరు వ్యక్తి ముఖ్యమంత్రి అయి జిల్లాకు ఏమైనా చేస్తారని ఎక్కువ మంది ఓట్లు వేశారు. కానీ ఇప్పుడు పాశ్చతాపం పడుతున్నారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునిరు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. ప్రాజెక్ట్ ను సందర్శించి పనులు పూర్తి చేసేందుకు పాలకులు దృష్టి పెట్టాలని సూచించారు. కాళేశ్వరం మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా మంత్రులకు ప్రాజెక్ట్‌లపై అవగాహన లేదని దుయ్యబట్టారు.

పాలమూరు ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమిక్షా చేయాలని, ప్రతిపక్ష పార్టీ నాయకుల అభిప్రాయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వడ్లు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. ÷-రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరించిందని, ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. పండించిన పంట కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఆరోపించారు. పాలమూరు ప్రాజెక్ట్ మీద కనీసం రివ్యూ చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి ప్రాజెక్ట్ ఆపాలని చూసినా 90 శాతం పనులు పూర్తి చేసి ఒక పంపును కేసీఆర్ ప్రారంభించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తిరిగి అధికారం లోకి వచ్చి ఉంటే 5 నెలల్లోనే పాలమూరును పూర్తి చేసే వాళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి ఉంటే రిజర్వయర్లు నింపుకునేందుకు అవకాశం ఉండేదని, పాలమూరు ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని అన్నారు.

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

మొదటిపేజీ తరువాయి..

దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# మేమంతా స్నేహితులుగా మారాం

మొదటిపేజీ తరువాయి..

డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం పేర్కొన్నారు. చైనాతో అమెరికా జరుపుతున్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తావించిన ట్రంప్, జిన్‌పింగ్ పర్యటన ఒక రిసిప్రొకాల్ పర్యటనగా నిలిస్తుందని అభివర్ణించారు. ట్రంప్ తన చైనా పర్యటన ముగింపు సందర్భంగా ఈ కీలక ప్రకటన చేశారు. అంతకు ముందు, బీజింగ్‌లోని జోంగ్‌నాన్‌హై నాయకులతో సమావేశమైన సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, షీ జిన్‌పింగ్‌కు, ఆయన ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.నేను జిన్‌పింగ్‌కు, ఆయన ప్రతినిధులు అందరికీ ధన్యవాదాలు చెప్పాలని అనుకుంటున్నాను. మేమంతా స్నేహితులుగా మారాం. వారు గొప్ప వ్యక్తులు. ఇక్కడికి రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. నేను మళ్లీ వస్తాను. సెప్టెంబర్ 24 లేదా ఆ తరువాత జిన్‌పింగ్ అమెరికా పర్యటనకు వస్తారని నేను నమ్ముతున్నాను. నేను చైనా పర్యటనకు వచ్చాను. అందుకు బదులుగ జిన్‌పింగ్ కూడా అమెరికా పర్యటనకు (రెసిప్రొకాల్)గా వస్తారు. నేను చైనా పర్యటన వల్ల ఎలా ప్రభావితమయ్యానో, మీరు (జిన్‌పింగ్) కూడా అమెరికా పర్యటన ముగిసిన తర్వాత అదే విధంగా ప్రభావితమై తిరిగి వస్తారని నేను ఆశిస్తున్నానని అన్నారు. చైనాలో తన రెండు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా, జిన్‌పింగ్ బృందంలో చర్చలు జరిపామని, ఫలితంగా 'అనేక విభిన్న సమస్యలు' పరిష్కారం అయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరుపక్షాలు ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, ఇరాన్ అమెరికా ఉద్రిక్తతలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ, చైనాలో పర్యటన అద్భుతంగా ఉందని, ఎన్నో సానుకూల ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు.ఇరాన్ అణ్వాయుధాలు పొందకుండా నిరోధించడం, వ్యూహాత్మక సముద్ర మార్గమైన హర్మూజ్ జలసంధిని తెరచి ఉంచడంపై జిన్‌పింగ్, తాను చర్చించామని, ఈ విషయంలో ఇద్దరి అభిప్రాయాలు ఒకేలా ఉన్నాయని ట్రంప్ వెల్లడించారు. అంతకు ముందు, చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరుదేశాధినేతలు ప్రధాన ద్వైపాక్షిక, ప్రపంచ సమస్యలపై లోతైన చర్చలు జరిపారని, ఒక ఉమ్మడి అవగాహనకు వచ్చారని తెలిపింది. అంతేకాదు రానున్న కాలంలో చైన-అమెరికా సంబంధాల స్థిరమైన అభివృద్ధి కోసం, ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం ఒక 'కొత్త విజన్' ఏర్పాటు చేసుకోవడంపై ఇరుదేశాలు ఒక అంగీకారానికి వచ్చాయని పేర్కొంది. గురువారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ చైనా పర్యటనకు రాగా, జిన్‌పింగ్ ప్రభుత్వం ఆయనకు ఘనస్వాగతం పలికింది. తరువాత జిన్‌పింగ్, ట్రంప్ బీజింగ్‌లోని 'టెంపుల్ ఆఫ్ హెవెన్'ను సందర్శించారు. గత తొమ్మిదేళ్లలో ట్రంప్ చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడంతో సర్వత్రా ఆసక్తి ఏర్పడింది. ఈ పర్యటనలో ఇరుదేశాల మధ్య అనేక ఒప్పందాలు కుదిరాయి. పర్యటన ముగించుకొని, తిరుగు ప్రయాణం అయిన ట్రంప్, చైనా పర్యటన తనకు ఎంతో సానుకూల అనుభవాన్ని ఇచ్చిందని వ్యాఖ్యానించారు."రానున్న మూడు ఏళ్లు, ఆ తరువాత చైనా-అమెరికా సంబంధాలకు వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని అందించడానికి, ఇరుదేశాల మధ్య సంబంధాలు స్థిరమైన, ఆరోగ్యకరమైన, సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడానికి, అలాగే ప్రపంచానికి మరింత శాంతి, శ్రేయస్సు, ప్రగతిని తీసుకురావడానికి వ్యూహాత్మక స్థిరత్వంలో కూడిన నిర్మాణాత్మక చైనా-అమెరికా సంబంధాన్ని నిర్మించాలనే కొత్త విజన్‌ను ఇరువురు అధ్యక్షుడు అంగీకరించారు" అని పేర్కొంది.

గురువారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ చైనా పర్యటనకు రాగా, జిన్‌పింగ్ ప్రభుత్వం ఆయనకు ఘనస్వాగతం పలికింది.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలి

– బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు కృష్ణవేణి యాదవ్




ఉప్పల్, మే 15 (సాక్ష్యం)..నాచారం పీఎస్ పరిధిలో గత బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలంటూ నాచారం పీఎస్ ముందు మృతుల కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. మౌలాలి హౌసింగ్ బోర్డ్ బీజేపీ మహిళా మోర్చా నాయకులు కృష్ణవేణి యాదవ్, బిఆర్ ఎస్ మల్లాపూర్ 5వ డివిజన్ అధ్యక్షురాలు,బీ ఆర్ ఎస్ నిర్మల నాయకురాలు ఆందోళనకు మద్దతు తెలుపుతూ నాచారం పోలీస్ స్టేషన్ ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి, మాట్లాడుతూ కార్ ను నిర్లక్ష్యంగా నడిపి ఇద్దరు గంగాధర్ , గణేష్ మృతికి కారణమైన వారిని శిక్షించడంతో పాటు మృతుల కుటుంబాలాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపి



హనుమకొండ 15 మే (సాక్ష్యం) ఆత్మకూర్ మండలం నీరుకుళ్ళ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎదుర్కోంటున్న సమస్యలు, ఇబ్బందులను పోలీస్ కమిషనర్ రైతులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుకోవడంతో , ధాన్యం తరలించేందుకుగా అవసరమైన లారీలు అందుబాటు లేక చాలా ఇబ్బందులకు గురొవుతున్నట్లు రైతులు పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుక పోవడంతో స్పందించిన సిపి లారీల సమస్యను జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ రైతులకు బరోసానిచ్చారు. పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్స్ స్పెక్టర్ సంతోష్, ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

## విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు దేవాలయాలతో సమానం

– జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు









చౌటుప్పల్ మే 15 (సాక్ష్యం) గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని, విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని గ్రంథాలయంలో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన, ఉత్తమ పాఠకులకు సన్మానాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు పాల్గొని మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సమాయాత్తమవుతున్న వారందరూ కూడా గ్రంథాలయాన్ని వినియోగించు కోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ పాఠకులైనహొ తరుణ్ కుమార్, వెంకటేష్, సూర్య లను అదనపు కలెక్టర్ సన్మానించారు. ఈ యొక్క కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుధీర్, ఆర్డీవో శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

– మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్



చౌటుప్పల్ మే 15 (సాక్ష్యం) ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీలోని బంగారుగడ్డలో యండి. పర్వీన్, యస్ కె. ఫరీన్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లులను చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా గృహప్రవేశం చేసిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్,కౌన్సిలర్లు హన్ను భాయ్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎండి బాబా షరీఫ్, సంద గళ్ళ విజయ సతీష్ గౌడ్, షేక్ నబీబి, పస్తం గంగరాములు, షాది ఖానా చైర్మన్ కరీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు చోటే భాయ్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఇంటింటి సర్వే



హైదరాబాద్ మే 15 (సాక్ష్యం) తెలంగాణలో ఇంటింటి సర్వే నిరంతరాయంగా కొనసాగుతుంది. జనగణన చేస్తున్నారు. ప్రజల వివరాలు నమోదు చేయడానికి మొత్తం ముప్ఫయి మూడు ప్రశ్నలను సిద్ధం చేశారు. మొత్తం పదహారు భాషల్లో ప్రశ్నావళిని రూపొందించిన అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. 33 ప్రశ్నలతో జనగణనలో నిక్కచ్చిమైన సమాచారం అందించాలని కోరుతున్నారు. ఇంటి యజమాని ఆదాయ వివరాలతో పాటు అన్ని రకాలుగా ఆదాయ వివరాలను తెలుసుకుంటున్నారు. అదే సమయంలో కులం పేరును కూడా అడిగి తెలుసుకుని నోట్ చేసుకుంటున్నారు. కులగణనతో పాటు జనగణనకు కూడా అధికారులకు ప్రజలు సహకరించాలని కోరుతున్నారు


## సీకెఎం డిగ్రీ కళాశాలలో మన గ్రంథాలయ జ్ఞానోత్సవం







వరంగల్ మే15 (సాక్ష్యం న్యూస్ ) : సి. కె. యం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వరంగల్ లో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం మరియు కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారి ఆదేశాలను అనుసరించి 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో మన గ్రంథాలయ జ్ఞానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయపాల్ రెడ్డి , బిల్లాల శివుడు రచించిన పుస్తకాలను ఆవిష్కరించి వారిని ఘనంగా సన్మానించారు.ఉత్తమ గ్రంథాలయ వినియోగదారులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. గ్రంథాలయ కార్యక్రమాల విశిష్టతను తెలిపే విధంగా భారీ బ్యానర్ ను మరియు పుస్తక ప్రదర్శన, గ్రంథాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.ఏ. ధర్మారెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పోటీ పరీక్షలకు విద్యార్థులు గ్రంథాలయాన్ని పరిపూర్ణశీగా వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి గ్రంథాలయ కార్యక్రమాల ద్వారా గ్రంథాలయంలో లభ్యమయ్యే పుస్తకాలు, ఎలెక్ట్రానిక్ వనరులు వాటి ఉపయోగం గురించి విద్యార్థుల కు మరియు అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భముగా వొంగురు విజయ్ సేవ స్ఫూర్తి ఫౌండేషన్ ఎన్. జీ. ఓ. సంస్థ , అమెరికా వారు గ్రంథాలయానికి పది వేల రూపాయల పుస్తకాలను విరాలము అందించుటకు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఇలాంటి గ్రంథాలయ విజ్ఞాన కార్యమాన్ని నిర్వహించిన గ్రంథపాలకులు యెస్.అనిల్ కుమార్ ని ప్రిన్సిపాల్ అభినందించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమం లో డాక్టర్ కె. ల్. వి. వరప్రసాద్ రావు , డాక్టర్ బి.విజయపాల్ రెడ్డి, ఎన్ సీ సీ అధికారి కెప్టెన్ సతీష్ కుమార్, అయేషా, ఎస్. వెంకటేశ్వర్లు, బిల్లాల శివుడు, ఏ. హరిబాబు, స్రవంతి, సుమన్,అంజయ్య, రాజేష్, నాగరాజు, కళాశాల సూపరెండెంట్ జి.శ్రీనివాస్, గ్యానేశ్వర్, పాషా , జమున, సరిత, సురేష్, రామరాజు , అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ముక్తంపురం గ్రామ రైతుల 40 ఏళ్ల భూ వివాదానికి ముగింపు..!

**– రెవెన్యూ అధికారుల మోసంతోనే 40 ఏళ్ల భూ తగాదా..!**

**భూమి మాది – దొంగ రికార్డు ఎవరిది..?**

**రికార్డ్ ట్యాంపరింగ్ చేసిన రెవెన్యూ అధికారుల పై ఖూజ 420,468 కింద కేసులు పెట్టాలి..?**

**ఊర్లో రైతులు కొట్టుకోవద్దు – దోషులు రెవిన్యూ అధికారులే..!**

**1977 నుంచి పట్టా హక్కు రైతులకు 40 ఏళ్ల నష్టానికి నష్టపరిహారం ఇవ్వాలి..?**

**న్యాయం కోసం ముక్తంపురం దళిత రైతులకు న్యాయం చూపాలి..!**

**ముక్తంపురం రైతులకు న్యాయం,అసలు దోషులను గుర్తించాలి..?శిక్షించాలి..?**

మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం ముక్తంపురం గ్రామ రైతుల 40 ఏళ్ల భూ పోరాటానికి తెరపడింది. వివరాల్లోకెళ్తే 1977 నుంచి పట్టా హక్కులు ఉన్న 143.88 ఎకరాల భూమిని కొందరు రెవెన్యూ అధికారులు అక్రమంగా అసైన్మెంట్ పట్టాలు ఇచ్చి,వెబ్‌ల్యాండ్‌లో వేరే వాళ్ల పేర్లు ఎక్కించారు.దీంతో అసలైన రైతులు, ముఖ్యంగా దళిత కుటుంబాలు భూమి ఉన్నా హక్కు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**అసలు రెవెన్యూ రికార్డులో ఏం జరిగింది..?**

1976లో ఎస్టేట్ అబాలిషన్ ట్రిబ్యునల్ ముక్తంపురంలోని 143.88 ఎకరాలు రైతుల పట్టా భూములని తీర్పు ఇచ్చింది.ఇది ఫైనల్ మరియు బైండింగ్ ఆర్డర్.దీన్ని ప్రభుత్వం కూడా ఎప్పుడూ సవాలు చేయలేదు.రైతుల పేర్లతో 1దీ,అడంగల్ రికార్డులు ఉన్నాయి. కానీ 1984,2006 సంవత్సరాల్లో కొందరు అవినీతి రెవెన్యూ అధికారులు బరితెగింపు చర్యకు పాల్పడ్డారు.మిడిమిడి జ్ఞానంతో, డబ్బులు తీసుకొని అదే పట్టా భూమికి అక్రమంగా అసైన్మెంట్ పట్టాలు ఇచ్చేశారు. అంతేకాకుండా వెబ్‌ల్యాండ్‌లో అసలైన రైతుల పేర్లు తీసేసి అసైన్మెంట్ దారుల పేర్లు ఎక్కించారు.ఈ మోసంతో అసలైన పట్టాదారులు ఆన్‌లైన్ రికార్డుల నుంచి మాయమైపోయారు.

**రైతుల 40 ఏళ్ల న్యాయపోరాటం..**

1977 నుంచి పట్టా హక్కులు ఉన్న 143.88 ఎకరాల భూమిని కొందరికీ భూమి తమదే అయినా రికార్డుల్లో పేరు లేకపోవడంతో రైతులు అమ్ముకోలేక,బ్యాంకు లోన్ రాక, పంట పెట్టుబడికి నరకం చూశారు.దీంతో వారు తహసిల్దార్ నుంచి కలెక్టర్ వరకు అన్ని ఆఫీసులు తిరిగారు.ఫలితం లేకపోవడంతో కింది కోర్టు నుంచి హైకోర్టు వరకు న్యాయపోరాటం చేశారు.హైకోర్టు 17 నవంబర్ 2022న స్పష్టమైన తీర్పు ఇచ్చింది.1977 ట్రిబ్యునల్ ఆర్డరే ఫైనల్ అని,అసైన్మెంట్లు చెల్లవని,అసలైన రైతుల పేర్లనే వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించాలని ఆదేశించింది.జాయింట్ కలెక్టర్ కూడా అసైన్మెంట్లు రద్దు చేసి రైతులకు అనుకూలంగా ఆర్డర్ ఇచ్చారు.

**అమలులో జాప్యం,కోర్టు ధిక్కరణ.**

కోర్టు,జాయింట్ కలెక్టర్ ఆర్డర్లు ఉన్నా వెబ్‌ల్యాండ్‌లో మార్పులు చేయలేదు.సర్వే నంబర్లు ఇంకా డిస్ప్యూట్ రిజిస్టర్‌లోనే ఉన్నాయి.టెక్నికల్‌గా తహశీల్దార్ లాగిన్‌లో పోర్టింగ్ ఆప్షన్ లేకపోవడం,అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు కోర్టు ధిక్కరణ కేసు 4741/2023 వేశారు.

**ఆర్డీఓ ఫైనల్ ఆర్డర్‌తో వివాదానికి ముగింపు..**

సామాజిక మేధావులు,న్యాయవాదుల జోక్యంతో చివరకు మార్కాపురం ఆర్డీఓ 28 ఏప్రిల్ 2026న స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు.సీసీఎల్ఏ సర్క్యులర్ ప్రకారం ఆర్డీఓ కి వివాదం తొలగించే అధికారం ఉంది.

**ఆర్డర్‌లోని ముఖ్యాంశాలు :**

ముక్తంపురం 143.88 ఎకరాల్లో 76.08 ఎకరాలను డిస్ప్యూట్ రిజిస్టర్ నుంచి తొలగించాలి. 48.93 ఎకరాలను ఇతరుల ఖాతా 90024 నుంచి అసలైన రైతుల పేర్ల మీదకు వెబ్‌ల్యాండ్‌లో పోర్ట్ చేయాలి. ఈ డివిజనల్ మేనేజర్ ఆర్డీఓ లాగిన్ ఎనేబుల్ చేసి ఈ పని పూర్తి చేయాలి.త్రిపురాంతకం తహసీల్దార్ వెంటనే 1బి, అడంగల్,పట్టాదారు పాస్ బుక్‌లు జారీ చేయాలి.

**ఊర్లో రైతులు, దళితులు పరస్పరం దాడులు సరికాదు..**

ఈ వివాదంలో అసలు మోసగాళ్లు ఎవరో గుర్తించకుండా ఊర్లో రైతులు, దళితులు పరస్పరం దాడులకు దిగడం సరికాదని సామాజిక మేధావులు హెచ్చరిస్తున్నారు. 1977 నుంచి రికార్డుల్లో ఉన్న అసలైన పట్టాదారులు ఎక్కువగా దళిత కుటుంబాలే. మధ్యలో అవినీతి అధికారులు డబ్బులు తీసుకొని అసైన్మెంట్లు ఇచ్చి ఇద్దరి మధ్య చిచ్చు పెట్టారు.

తప్పు చేసింది అసైన్మెంట్ తీసుకున్న పేదవాడు కాదు.తప్పుడు పట్టాలు ఇచ్చి, వెబ్‌ల్యాండ్‌లో అక్రమంగా పేర్లు ఎక్కించిన అధికారులది.కాబట్టి గ్రామస్తులు సంయమనం పాటించాలి.అసలు దోషులైన అవినీతి అధికారుల పై చర్యలకు డిమాండ్ చేయాలి.

**ఇక అధికారులు ఏం చేయాలి...**

కోర్టు జడ్జిమెంట్ వచ్చిన తర్వాత అధికారులు వాటిని అమలు చేయడమే తప్ప ఇంకేం చేయగలరు.మొట్టమొదటి ఆన్‌లైన్ జాబితా రైతులకు యధావిధిగా వెబ్‌ల్యాండ్ రికార్డులలో పేర్లు ఎక్కించాలి.ఇప్పుడు ఆర్డీవో ఆర్డర్‌తో ఆ పని మొదలైంది.ఈ ఆర్డర్‌తో ముక్తంపురం రైతులు తమ భూమిని అమ్ముకోవచ్చు,బ్యాంకు లోన్ తెచ్చుకోవచ్చు, పిల్లలకు వారసత్వంగా ఇవ్వొచ్చు.40 ఏళ్ల భూ తగాదాకు ఎండ్ కార్డ్ పడింది.అవినీతి అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**మేధావుల వివరణ మేరకు :-**

1956 ఇనామ్ రద్దు చట్టం – ముఖ్య విషయాలు... చట్టం ఉద్దేశం ఏంటి..? బ్రిటిష్ కాలంలో,నిజాం కాలంలో ఇనాందార్లు, మఠాలు,దేవాలయాలకు ఉచితంగా ఇచ్చిన ఇనామ్ భూములను రద్దు చేసి,అసలైన సాగుదారులకు రైత్వారీ పట్టా ఇవ్వడం కోసం ఈ చట్టం తెచ్చారు.

**కీలక సెక్షన్లు – ముక్తంపురంకు ఎలా వర్తిస్తుంది..?**

సెక్షన్ చెప్పేది ఏంటి..?ముక్తంపురం కేసులో సెక్షన్ 3అన్ని ఇనామ్ భూములు ప్రభుత్వానికి చెందుతాయి.ఇనాందార్ హక్కులు రద్దు.1977లో ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకొని దళితులకు పట్టా ఇచ్చింది.అది చట్టబద్ధం.సెక్షన్ 4ఇనామ్ భూమిని సాగు చేస్తున్న కౌలుదారుకు రైత్వారీ పట్టా ఇవ్వాలి. మీ తాతలు 1956కు ముందు నుంచి సాగు చేస్తున్నారు కాబట్టి మీకే పట్టా హక్కు ఉంది. సెక్షన్ 7 రైత్వారీ పట్టా వచ్చిన భూమి బదిలీ చేయదగిన,వారసత్వపు ఆస్తి అవుతుంది.మీ 1977 పట్టా భూమిని ఎవరూ అసైన్మెంట్ చేయడానికి వీలు లేదు.అమ్ముకోవచ్చు, వారసులకు ఇవ్వొచ్చు. సెక్షన్ 11ఈ చట్టం కింద ఇచ్చిన పట్టాను సివిల్ కోర్టులో తప్ప ఎవరూ రద్దు చేయలేరు.తహశీల్దార్ ఆర్డీవో కు అధికారం లేదు.1984లో తహశీల్దార్ మీ పట్టా భూమిని అసైన్మెంట్ చేయడం 100% చట్టవిరుద్ధం.అది చెల్లదు.

**ముక్తంపురం అధికారులు చేసిన తప్పు ఏంటి..?**

1956 చట్టం ప్రకారం ఒకసారి రైత్వారీ పట్టా ఇచ్చాక,ఆ భూమి ప్రైవేట్ పట్టా భూమి అయిపోతుంది.దాన్ని మళ్లీ అసైన్మెంట్ భూమిగా మార్చడానికి రెవెన్యూ అధికారులకు అధికారం లేదు.అసైన్మెంట్ కమిటీకి కూడా అధికారం లేదు.1984లో,2006లో తహశీల్దార్ లు ఈ చట్టాన్ని తుంగలో తొక్కి,పట్టా భూమికి దొంగ అసైన్మెంట్ పట్టాలు ఇచ్చారు.ఇది ఖూజ 167 – పబ్లిక్ సర్వెంట్ చట్టానికి విరుద్ధంగా తప్పుడు డాక్యుమెంట్ తయారు చేయడం అనే నేరం. 7 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది.

**సుప్రీంకోర్టు తీర్పు..**

State of A.P. vs.P. Ramanaiah 2009 కేసులో సుప్రీంకోర్టు చెప్పింది.. "ఒకసారి ఇనామ్ భూమికి రైత్వారీ పట్టా ఇచ్చాక, రెవెన్యూ అధికారులు దాని స్వభావాన్ని మార్చలేరు.అలా చేస్తే ఆ ఉత్తర్వు చెల్లదు. 1956 చట్టం ప్రకారం మీ 1977 పట్టా గ్రానైట్ కంటే గట్టిది.దాన్ని అసైన్మెంట్ చేసిన ప్రతి ఉత్తర్వు,ప్రతి రికార్డు చట్టవిరుద్ధం.అక్రమ అసైన్మెంట్లు ఇచ్చిన అధికారులను కోర్టుకు లాగితే శిక్ష తప్పదు.

## విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి

– దేవరకొండ ఎమ్మెల్యే బాలునాక్







డిండి. సాక్షం న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆయన శుక్రవారం డిండి మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాల లో 50 లక్షలతో నిర్మించిన నూతన తరగతి భవనాన్ని ప్రారంభించారు. మరియు అదే పాఠశాలలో ప్రహరీ గోడ ఎత్తు పెంచుటకు 30 లక్షలతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ కావలసిన నిధులను కేటాయిస్తూ, అభివృద్ధిని కోరుకుంటుందని అన్నారు. ప్రభుత్వమిస్తున్న ఈ సదవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక పాఠశాలలో ఉన్న కనీస వసతుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, గతంలో అనేక పర్యాయాలు మండల కేంద్రానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధికి సహకరించానని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహ,ఎంపీడీవో వెంకన్న,పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి , ఉపాధ్యాయునీ లు, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు డి వెంకటేశ్వరరావు,స్థానిక సర్పంచ్ నల్లగంతుల రవి, గోనకల్ గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి,వావి ల్ కోల్ గ్రామ సర్పంచ్ జంగారెడ్డి, శత్రు తండా గ్రామ సర్పంచ్ బధ్యానాయక్, వివిధ గ్రామాల సర్పంచులు రేఖ నాయక్,తేజు నాయక్,శ్రీనివాస్ నాయక్,శ్రవణ్ కుమార్ నాయక్, రామచేంద్రయ్య, స్థానిక నాయకులు బద్దెల శ్రీనివాస్, వావిల్లా సలయ్య, కలీం, శ్రీనివాస్ గౌడ్ , ప్రవీణ్ రెడ్డి, బాలయ్య, కాంట్రాక్టర్ గోసుల అనంతగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్సీ తర్వాత ఉన్నత విద్యపై దృష్టి పెట్టాలి

## - విద్యార్థులు భవిష్యత్తును నిర్మించుకోవాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా





**మహబూబ్‌నగర్, మే 15 ( సాక్ష్యం బ్యూరో ) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మాల మమత కలిసి ఎస్ఎస్సీలో ముగ్గురు, ఇంటర్‌లో ముగ్గురు, క్రీడల్లో ముగ్గురు ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 9 మంది జిల్లా టాపర్లకు రూ.10 వేల నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. అలాగే జిల్లాలో ఎస్ఎస్సీ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన 57 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను శాలువాతో సత్కరించి, ఆయా పాఠశాలల టాప్ విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సమిష్టి కృషితో జిల్లాలో ఎస్ఎస్సీ ఫలితాల్లో 92.70 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, నూటికి నూరు శాతం ఫలితాలు నమోదు చేసిన పాఠశాలలను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్ఎస్సీ తర్వాత విద్యార్థులు ఉన్నత విద్యపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా బాలికలు చదువు మధ్యలో ఆపకుండా ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా అవకాశాలపై మండలాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ, ఎస్ఎస్సీ ఫలితాల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించడం ఆనందదాయకమన్నారు. విద్యార్థి జీవితంలో ఎస్ఎస్సీ పరీక్షలు తొలి మెట్టని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని, విద్యార్థులు దానిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్య విజయోత్సవాలు జిల్లాలో విద్యా ప్రగతికి దోహదపడుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 180 పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రాజశేఖర్ రెడ్డి, సి.ఎం.ఓ సుధాకర్ రెడ్డి, ఎ.ఎం.ఓ శ్రీనివాస్, జి.సి.డి.ఓ ఆశ్ర ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

## - సిపిఎం పార్టీ మండల కమిటీ డిమాండ్



**సాక్ష్యం మే 15 పాలేరు** తిరుమలాయపాలెం మండలంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను పోక్సో చట్టం కింద వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వసపంగు వీరన్న మాట్లాడుతూ రాజకీయ అండదండలతో మైనరు బాలికను పలుమార్లు లైంగిక సంబంధాలు కొనసాగిస్తూ హింసకు గురి చేశాడని పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన గాని ఇంతవరకు పోలీసులు అతనిని అరెస్టు చేయకపోవటం ఫోక్సో కేసు నమోదు చేయకపోవడం చాలా విడ్డూరంగా ఉందని వారి పేర్కొన్నారు ఇప్పటికైనా బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు దాసరి మహేందర్ మండల రైతు సంఘం అధ్యక్షులు తుళ్లూరు నాగేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నె ర్సుల వెంకటేశ్వర్లు ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా నాయకులు బచ్చోడు శాఖ సెక్రెటరీ గుండమల్ల ఉ పేందర్ సుబ్లేడు గ్రామ శాఖ సెక్రెటరీ వార్డ్ మెంబర్ పోలె పొంగు ముత్తయ్య మండల సిపిఎం పార్టీ నాయకులు కొమ్ము నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# పాలమూరు యూనివర్సిటీలో ప్రజాపాలన

## - ప్రగతి ప్రణాళిక 5వ రోజు కార్యక్రమాల నిర్వహణ





**మహబూబ్‌నగర్, మే 15 ( సాక్ష్యం బ్యూరో ) :** పాలమూరు యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా 5వ రోజు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్స్ ఎగ్జిబిషన్, ఉచిత హెల్త్ చెకప్ క్యాంప్, విలేజ్ అడాప్షన్ అవగాహన కార్యక్రమం, రక్తదాన శిబిరం వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి పెంపొందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యత మరియు సేవాభావాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స పొందవచ్చని సూచించారు. యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, శారీరక ఆరోగ్యం బాగుంటేనే మానసిక స్థిరత్వం, విద్యలో ఏకాగ్రత, జీవితంలో విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రక్తదానం మహత్తర మానవతా సేవ అని, ఒక యూనిట్ రక్తం అనేక ప్రాణాలను కాపాడగలదని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి యువతీ యువకుడు సంవత్సరానికి కనీసం ఒకసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. బుక్స్ ఎగ్జిబిషన్, విలేజ్ అడాప్షన్, హెల్త్ చెకప్ క్యాంప్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో జ్ఞానం, సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసమే కాకుండా సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. చదువుతో పాటు ఆరోగ్యం, సామాజిక సేవ, నైతిక విలువలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమాలు విద్యార్థుల్లో పఠన అలవాటు, సామాజిక బాధ్యతను పెంపొందిస్తున్నాయని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా. చంద్రకిరణ్, పరీక్షల నియంత్రణ అధికారి డా. కే. ప్రవీణ్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ





**యాదగిరి కొండ సాక్షి న్యూస్..** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు, అమ్మవారికి ఊంజల్ సేవ పర్వాలను అర్చకులు శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం ఆలయంలో ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఉంజల్ సేవ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ రకాల పూలతో, తులసి దళాలతో, పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు ఊంజల్ సేవలో, కొలువై ఉన్న ఆండాళ్ అమ్మవారికి హారతినిస్తూ కీర్తన చేశారు. వేద మంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాల సన్నాయి మేళంనడుమ అమ్మవారికి ఉంజల్ సేవ మహోత్సవం కోలాహలంగా నిర్వహించారు. మొదటగా శ్రీ మన్యు సూక్త పారాయణం జరిపారు. ప్రత్యేకంగా బంగారంతో తయారుచేసిన 108 పుష్పాలను శ్రీవారి సన్నిధిలో ఉంచి వాటితో అర్చన జరిపారు. తిరువీధి సేవ అనంతరం అమ్మవారిని ఆలయంలోని అద్దాల మండపంలోని ఉయ్యాలలో శయనిపు చేయించారు. గంట పాటు వివిధ రకాల పాటలతో అమ్మవారిని కొనియాడుతూ, లాలి పాటల కోలాహలం కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీ స్వామి అమ్మ వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

## మోటార్లు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయి

# పాలమూరు ప్రాజెక్ట్ పనులు ఎందుకు నిలిపారు.?"



- ప్రభుత్వంపై మాజీ మంత్రుల ఫైర్..
- జూన్‌లో భారీ పాదయాత్ర హెచ్చరిక
- "పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే పాదయాత్రతో ప్రభుత్వం మెడలు వంచుతాం" బీఆర్ఎస్ మాజీ మంత్రుల హెచ్చరిక..

**మహబూబ్‌నగర్, మే 15 ( సాక్ష్యం బ్యూరో ) :** పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను తక్షణమే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని, లేదంటే నర్లాపూర్ నుంచి ఉదండాపూర్ వరకు భారీ పాదయాత్ర చేపట్టి ప్రభుత్వం మెడలు వంచుతామని మాజీ మంత్రులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రులు కేసిఆర్ ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేస్తే లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా ఒకప్పుడు అత్యధిక వలసలు వెళ్లిన జిల్లాగా ఉండేదని, సాగునీరు అందించాలనే లక్ష్యంతో పాలమూరు ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసి భారీగా పనులు పూర్తి చేశామని తెలిపారు. "మోటార్లు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయి.. కానీ ప్రభుత్వం ఇప్పటికీ ప్రారంభించడం లేదు" అని విమర్శించారు. జూన్ నెలలో పాదయాత్రపై పార్టీ అధినేత కే చంద్రశేఖర్ రావ్ తో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా, "లీడర్ల కొనుగోళ్లు" జరుగుతున్నాయని విమర్శించారు. లారీలు, సంచులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడంతో జిల్లాకు మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ ఇప్పుడు ప్రజలు పశ్చాత్తాపం పడుతున్నారని వ్యాఖ్యానించారు. పాలమూరు ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించి, పనులు పూర్తి చేయడానికి దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ పాలమూరు ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వట్టెం నుంచి డిండి వరకు నీళ్లు తరలించే ప్రణాళిక ఉందని గుర్తుచేశారు. "జిల్లా మంత్రులకు ప్రాజెక్టులపై అవగాహన లేదు" అని విమర్శిస్తూ, 2023 తర్వాత అదనంగా ఎంత సాగునీరు అందించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయని, 40 కిలోల బస్తాకు 4 కిలోల తరుగు తీస్తున్నా ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. టెండర్లు వేసిన వారివద్ద సరిపడా వాహనాలు కూడా లేవని విమర్శించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. కాంగ్రెస్ నేతలు కేసులు వేసి ప్రాజెక్ట్‌ను అడ్డుకునే ప్రయత్నాలు చేసినప్పటికీ 90 శాతం పనులు పూర్తి చేశామని అన్నారు. "మేము తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే ఐదు నెలల్లో పూర్తి చేసేవాళ్లం" అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించిందని, ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతో పాటు పండించిన పంట కొనుగోలు చేసేందుకు సరైన కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, అంజయ్య యాదవ్, మర్రి జనార్ధన్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి అర్ ఎస్ ప్రవీణ్ కుమార్ , ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, సురభి వాణీ దేవి, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ సేవలో

## యాదగిరిగుట్టకు జాతీయస్థాయి గుర్తింపు

**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్** జాతీయ స్థాయి లో 29వ జాతీయ సదస్సు లో నిర్వహించబడగా, యాదగిరిగుట్ట దేవస్థానం తరఫున జె. భవానీ శంకర్ ,ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పాల్గొని ప్రజెంటేషన్ సమర్పించారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలు చేపట్టిన డిజిటల్ సేవల పరివర్తన కార్యక్రమాలు ప్రదర్శించబడ్డాయి. మొదటి దశలో దేశవ్యాప్తంగా మొత్తం 802 అప్లికేషన్లు అందగా, వాటిలో కేవలం 32 ప్రాజెక్టులు మాత్రమే షార్ట్‌లిస్ట్ చేయబడ్డాయి. ఈ ఎంపికలో తెలంగాణ రాష్ట్రం నుంచి యాదగిరిగుట్ట దేవస్థానం చోటు దక్కించుకోవడం విశేషమైన గౌరవంగా భావించబడుతోంది. రెండవ దశలో భాగంగా, ఏప్రిల్ తేదీలలో జాతీయ అవార్డుల బృందం దేవస్థానాన్ని ప్రత్యక్షంగా సందర్శించి సమగ్ర పరిశీలన నిర్వహించింది. ఈ పరిశీలన నివేదికల ఆధారంగా స్క్రీనింగ్ కమిటీ మా ప్రాజెక్టును తదుపరి దశకు ఎంపిక చేసింది. దేవస్థానం బృందం ఢిల్లీకి వెళ్లి జ్యూరీ సమక్షంలో ఫైనల్ ప్రజెంటేషన్ సమర్పించింది. ఈ ప్రజెంటేషన్ ప్రాజెక్ట్ హెడ్ ద్వారా సమగ్రంగా వివరించబడగా, జ్యూరీ సభ్యుల నుండి సానుకూల స్పందన లభించింది. యాదగిరిగుట్ట దేవస్థానం చేపట్టిన డిజిటల్ పరివర్తన కార్యక్రమాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేషమైన విషయం. భక్తులకు పారదర్శకత, సౌలభ్యం, సమర్థతను అందించడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇటీవలి కాలంలో యాదగిరిగుట్ట దేవస్థానం ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతూ, "తెలంగాణ తిరుపతి"గా ఖ్యాతి గడిస్తున్న నేపథ్యంలో, ఈ జాతీయ స్థాయి గుర్తింపు దేవస్థానానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చింది.



# పెట్రోలు ధరలపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?




**హైదరాబాద్ మే 15 (సాక్ష్యం)** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. అమెరికా-ఇరాన్ యుద్ధం వల్లే పెట్రోల్, డీజిల్ ధరల పెంచడం జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. చమురు సంస్థలు నష్టాలలో నడుస్తున్నా నాలుగేళ్ల నుంచి పెట్రోలు, డీజిల్ ధరలను పెంచలేదని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో క్రూడాయిల్ దిగుమతికి ఖర్చు భారీగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. పెట్రోలు భారం ప్రజలపై వేయ కూడదని భావించినప్పటికీ తప్పని సరి పరిస్థితుల్లో పెంచాల్సి వచ్చిందన్నారు. పనీపాటాలేని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పెట్రోలు, డీజిల్ పెంపు పై రాజకీయం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

# సిట్ అధికారులకు బండి భగీరథ్ లేఖ



**హైదరాబాద్ మే 15 (సాక్ష్యం)** బండి సంజయ్ కుమారుడు భగీరథ్ సిట్ అధికారులకు లేఖ రాశారు. తాను విచారణకు హాజరయ్యేందుకు రెండు రోజుల సమయం కావాలని కోరారు. తనకు నోటీసు అందిందని, విచారణకు సహకరించడానికి, అలాగే దానికి సంబంధించి తన నుంచి పూర్తి సంసిద్ధతను తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. తాను అధికారి ముందు హాజరై, కోరిన విధంగా దర్యాప్తుకు సహకరిస్తానని బండి భగీరథ్ పేర్కొన్నారు. రెండురోజుల సమయం తనకు చాలా తక్కువ వ్యవధిలో నోటీసు ఇచ్చినందున కొన్ని వ్యక్తిగత అసౌకర్యాల కారణంగా..నోటీసులో నిర్దేశించిన తేదీన తాను హాజరు కాలేకపోతున్నానని తెలిపారు. అందువల్ల తన పైనా తన కుటుంబంపైనా చేసిన తప్పుడు ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తుకు అర్థవంతంగా సహాయపడే తన వద్ద ఉన్న సంబంధిత సామాగ్రి, పత్రాలు మరియు సమాచారాన్ని సమీకరించుకోవడానికి వీలుగా, నోటీసులో నిర్దేశించిన తేదీ నుంచి రెండు రోజుల గడువును బండి భగీరథ్ కోరారు.

# ధరలు పెంచితే ఊరుకోం: నాదెండ్ల



**అమరావతి 15 మే (సాక్ష్యం)** ఇంధన ధరల పెంపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య అని ఆంధ్రప్రదేశ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంధనం పొదుపు చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపు నిచ్చారు. పెట్రోలు ధరల పెంపుతో కావాలని నిత్యావసరాల ధరలు పెంచితే ఊరుకోబోమని నాదెండ్ల వార్నింగ్ ఇచ్చారు. నిత్యావసరాల ధరల నిత్యావసరాల ధరల నియంత్రణకు సమీక్షలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పెట్రోల్‌పై ఆధారపడటం తగ్గించేలా ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. అలాగే నిత్యావసరాలు బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే కఠినంగా శిక్షిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు.

# అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం



**అమరావతి 15 మే (సాక్ష్యం)** రాజధాని అమరావతి అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచే అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో రాజధానిని తీర్చిదిద్దే లక్ష్యంతో గుంటూరు జిల్లా తాడికొండ మండలంలోని రావెల గ్రామం సమీపంలో సుమారు 4,618 ఎకరాల భూమిని విమానాశ్రయ నిర్మాణానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. రాజధాని అమరావతికి అత్యంత సమీపంలో ఉండటంతో పాటు గుంటూరు, విజయవాడ నగరాలకు సులభ అనుసంధానం కలిగే విధంగా ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ప్రతిపాదిత అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండే ఈ ప్రదేశం ప్రస్తుత సచివాలయం నుంచి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. విమానాశ్రయం నిర్మాణంలో మరో ముఖ్య అంశం గ్రామాల పునరావాస సమస్య తలెత్తకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడం. హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కోసం నాలుగు గ్రామాలను తరలించాల్సి వచ్చిన నేపథ్యంలో, అమరావతిలో అలాంటి పరిస్థితి లేకుండా గ్రామాలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో స్థల ఎంపిక చేపట్టారు. ఈ నేపథ్యంలో ఒక్క గ్రామాన్నీ తరలించాల్సిన అవసరం లేకుండా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం గుర్తించిన భూములు రాజధాని రెండో దశ భూసమీకరణ పరిధిలో లేవని అధికారులు చెబుతున్నారు. భూసమీకరణ ద్వారా తీసుకోవాలా లేదా భూసేకరణకు వెళ్లాలా అన్న అంశంపై రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం త్వరలో తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయ ప్రతిపాదనకు ఇప్పటికే భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ప్రీ-ఫీజిబిలిటీ స్టడీ పూర్తి చేసి సానుకూల సంకేతాలు ఇచ్చింది. అలాగే రైట్స్ కన్సల్టెన్సీ సంస్థ టెక్నో-ఎకనమిక్ ఫీజిబిలిటీ నివేదికను సిద్ధం చేసింది. ఈ నివేదికల ఆధారంగా ప్రాజెక్టు అమలు దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. భారీ బోయింగ్ 777 విమానాలు కూడా దిగేలా విమానాశ్రయాన్ని డిజైన్ చేయడం విశేషం. తొలి దశలోనే సుమారు రూ.3,409 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా వేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వచ్చే 60 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఐదు దశల్లో విమానాశ్రయాన్ని విస్తరించేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. 2028 నుంచి 2030 మధ్య నిర్మాణం పూర్తయ్యే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ప్రారంభమైన తర్వాత తొలి పదేళ్లలోనే సంవత్సరానికి 63.5 లక్షల మంది ప్రయాణికులు ఈ విమానాశ్రయాన్ని వినియోగించే అవకాశముందని అంచనా వేసి, అందుకు అనుగుణంగా తొలి దశ రూపకల్పన చేశారు. మొదటి దశలో సుమారు 2,648 ఎకరాల్లో విమానాశ్రయ నిర్మాణం చేపడతారు. 4 వేల మీటర్ల పొడవు, 60 మీటర్ల వెడల్పుతో ఆధునిక రన్‌వే నిర్మించనున్నారు. కేవలం విమానాశ్రయానికే పరిమితం కాకుండా విమానాల మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) సదుపాయాలతో సమీకృత వైమానిక హబ్‌గా దీనిని అభివృద్ధి చేయాలని ప్రణాళిక సిద్ధమైంది. అంతేకాకుండా హోటళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఇతర వాణిజ్య ప్రాజెక్టులతో ప్రాంతాన్ని ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. మొత్తం భూభాగంలో 3,823 ఎకరాల్లో విమానాశ్రయం మరియు సంబంధిత సదుపాయాలు ఏర్పాటు చేయగా, 795 ఎకరాలను వాణిజ్య అవసరాలకు కేటాయించనున్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అదనంగా 200 ఎకరాలు అవసరమని గుర్తించారు. రవాణా అనుసంధాన పరంగా కూడా ఈ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. విస్తరణకు సిద్ధమవుతున్న అనంతపురం-గుంటూరు జాతీయ రహదారి విమానాశ్రయం సమీపం గుండా వెళ్లి కోల్‌కతా-చెన్నై హైవేతో కలవనుంది. అలాగే గన్నవరం విమానాశ్రయం నుంచి 60 కిలోమీటర్లు, గుంటూరు రైల్వే స్టేషన్ నుంచి 21 కిలోమీటర్లు, విజయవాడ బస్టాండ్ నుంచి 43 కిలోమీటర్ల దూరంలో ఈ విమానాశ్రయం ఉండనుంది. దీంతో అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయం భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌కు కీలక రవాణా, వాణిజ్య కేంద్రంగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో ఇంత నిర్లక్ష్యమేలా: ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య




**వరంగల్,15 మే (సాక్ష్యం)** చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్, 2014 జనవరి 26 న అప్పటి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి బస్వరాజు సారయ్య భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. కానీ పనులు మొదలు కాలేదు తదనంతరం 2014 జూన్ 02- వ సంవత్సరంలో తెలంగాణ ఏర్పడ్డది తెరాస ప్రభుత్వం మొదటి సారి అధికారం చేపట్టి పక్కనే మైనార్టీ సాధిఖానా కోసం పురాతన ప్రసిద్ధి గల (రంకులమ్మ) గుట్టను తవ్వి సుమారు ఏడు కోట్ల నిధులతో మైనారిటీ ప్రజానీకం అడగకుండా వారి జనాభా ఇక్కడ లేకున్నా షాదీఖాన నిర్మాణం చేపట్టగా అప్పటి శాసనసభ్యురాలు ప్రస్తుత వరంగల్ తూర్పు ఎమ్మెల్యే దేవాదాయ పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ మంత్రి కొండా సురేఖ ను ఈ సందర్భంగా రజకులు కమ్యూనిటీ భవనానికి భూమి పూజ జరిగింది పనులు ప్రారంభం కావడం లేదని అడగగా రజక భవనానికి సైతం మరలా 2015 లో శంకుస్థాపన చేశారు. షాది ఖానా నిర్మాణ క్రమంలోనే రజక కమ్యూనిటీ హాల్ కూడా నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే సదరు గుత్తేదారుకు ఆదేశాలు జారీచేసి కార్పొరేషన్ నిధుల నుంచి ఐదు లక్షల రూపాయలు మంజూరీ ఇపించారు. కానీ సదరు రజక కమ్యూనిటీ హాల్ ఆరు పిల్లర్ల వరకే పరిమితమైంది మైనారిటీ షాదీ ఖానా యొక్క బిల్లులు రావడంలేదని రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణపు పనులను కూడా స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణం ఆపివేశారు. రెవెన్యూ లెక్కల ప్రకారం కార్పొరేషన్ ప్లానింగ్ లో కూడా సదరు కమ్యూనిటీ హాల్ కోసం ప్రభుత్వం స్థలం కేటాయించి భవనిర్మానికి మంజూరు ఇచ్చినప్పటికీ గుత్తేదారు నిర్మాణం చేపట్టకపోవడం స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపెట్టకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో అపుడు ఎమ్మెల్యే గా ఉన్న కొండా సురేఖ పార్టీ మారడం 2018లో మరల రెండవసారి తెరాస ప్రభుత్వం అధికారంలోకి రావడం అప్పటి ఎమ్మెల్యే నల్లపునేని నరేందర్ ను పలుమార్లు భవన నిర్మాణం కొరకు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా రజక సామాజిక వర్గానికి చెందిన కులస్తులు పలుమార్లు సంప్రదించగా తాను పట్టించుకోలేదు, ప్రారంభించలేదు కాబట్టి తనకేమి సంబంధం అన్నట్లు వ్యవహరించారు. అప్పటి ఎమ్మెల్యే నరేందర్ మైనారిటీ షాది ఖానా మైనారిటీ గురుకుల పాఠశాలలకు అప్పగిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు జిల్లా యంత్రాంగం చేత సభ ఏర్పాటు చేసి నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన అప్పటి ఎమ్మెల్యే ప్రస్తుతం మంత్రిగా ఉన్న పలుమార్లు విజ్ఞప్తులు చేసిన రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను పూర్తి చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది రజకుల పట్ల ప్రభుత్వానికి ఏ పార్టీ చిత్తశుద్ధి ఉన్నదో అర్థమవుతుంది. గత పాలకులే ప్రస్తుతం అధికారంలో ఉన్న పనులు చేపట్టకపోవడం పట్ల స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు స్పందించి కమ్యూనిటీ హాల్ నిర్మాణ భవనాన్ని పూర్తిచేసి అట్టడుగు వర్గాల ఉన్న రజక కులస్తులను వారి అభివృద్ధి కోసం సంక్షేమం కోసం ఆదుకునేందుకు పలు అంశాల చర్చలకు ఈ భవనాన్ని పూర్తిచేసి ప్రభుత్వ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని స్థానిక రజకులు, శాతవాహన రజక సహకార కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

# చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే సహించేది లేదు

## – ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్





**వరంగల్, 15 మే (సాక్ష్యం)** వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో మామూనూర్ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం మామూనూర్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఈస్ట్ జోన్ డీసీపీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రౌడీ షీటర్ల ను హెచ్చరిస్తూ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు మరియు నేరప్రవర్తన కలిగిన వ్యక్తులు చట్టబద్ధంగా, సమాజానికి హాని కలగకుండా ప్రవర్తించాలని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, గొడవలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని. చట్టాలను గౌరవిస్తూ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే పనులు, మద్యం, జూదం, అక్రమ వసూళ్లు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. తమ పరిసరాల్లో ఎటువంటి నేర సంఘటన జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాజంలో మంచిగా జీవిస్తూ ఉపాధి పొందేందుకు ప్రయత్నించాలని, ఫోన్ నంబర్, చిరునామా లేదా ఇతర వ్యక్తిగత వివరాల్లో మార్పులు వచ్చినప్పుడు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకుని చట్టానికి లోబడి జీవిస్తే సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవచ్చని, లేకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మామూనూర్ ఏసీపీ వెంకటేష్, మామూనూర్, గీసుగొండ, ఏనుమాముల ఇన్స్ స్పెక్టర్లు శ్రీనివాస్ యాదవ్, విశ్వేశ్వర్, సురేష్ సంగెం ఎస్.ఐ వంశీ కృష్ణ పాల్గొన్నారు.

# గోవింద నామస్మరణలతో మారుమోగుతున్న తిరుమల




**అమరావతి 15 మే (సాక్ష్యం)** తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం కావడంతో ఒక్కసారిగా రద్దీ మరింత పెరిగింది. వేసవి సెలవులు, శుభకార్యాలు జోరుగా జరుగుతుండటంతో పాటు తిరిగి విద్యాసంస్థలు ప్రారంభమవుతాయని భావించి శ్రీవారికి మొక్కులు చెల్లించుకునేందుకు తిరుమలకు భక్తులు పోటెత్తారు. దీంతో తిరుమల భక్తులతో కిక్కిరిసిపోయింది. తిరుమల లోని అన్ని వీధులు గోవింద నామ స్మరణలతో మారు మోగిపోతున్నాయి. తిరుమలకు అన్ని ప్రాంతాల నుంచి భక్తులు అన్ని రవాణా మార్గాల ద్వారా చేరుకుంటున్నారు. తిరుమలకు ప్రతి రోజు ఎనభై వేల మంది భక్తులు దర్శించుకుంటారు. ఒక్కోసారి మరింత ఎక్కువ మంది వచ్చినా సత్వరం సామాన్య భక్తులకు దర్శనం కలిగేలా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడకుండా మాడ వీధుల్లోనూ, తిరుమల ఆలయం పరిసర ప్రాంతాల్లో కూల్ పెయింట్ వేసిన అధికారులు భక్తులకు నిరంతరం చల్లటి నీరు, మజ్జిగ, అన్న ప్రసాదాలను అందిస్తున్నారు. శ్రీవారి సేవకులు నిరంతరం తమ సేవలను అందిస్తున్నారు. ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లలో భక్తులు నిండిపోయారు. శ్రీవారి దర్శనం కోసం బయట శిలాతోరణం వరకూ క్యూ లైన్ విస్తరించింది. సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం ఇరవై నాలుగు గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు ఆరు గంటలకు పైగానే సమయం పడుతుంది. మూడువందల ప్రత్యేక దర్శనం టోకెన్లున్న భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయ పడుతుంది. నిన్న శ్రీవారిని 67,722 భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారికి తలనీలాలు 36,705 మంది భక్తులు సమర్పించుకున్నారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.45 కోట్లు వచ్చిందని అధికారులు తెలిపారు.

# పుట్టపర్తిలో ప్రతిష్ఠాత్మకమైన డిఫెన్స్ ప్రాజెక్టు




**అమరావతి 15 మే (సాక్ష్యం)** రాయలసీమ దేశ రక్షణ రంగంలోనూ ప్రత్యేకతను సంతరించుకుంటోంది. ఈరోజు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో దేశం గర్వించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ డిఫెన్స్ ప్రాజెక్టును ఏరో నాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ-డీఆర్డీఓ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొననున్నారు. 15,803 కోట్ల రూపాయలతో, 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనుంది. ఇది భారతదేశపు మొట్టమొదటి ఫిఫ్త్ జనరేషన్ స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్ అని చెబుతున్నారు. ఇందులో స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్ సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక ఏవియానిక్స్ వంటి హంగులతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేయనున్నారు. యుద్ధ విమానాలను పుట్టపర్తిలోనే అభివృద్ధి చేయడంతోపాటు... టెస్టింగ్ కూడా చేపట్టేలా ప్రాజెక్టును రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా.అలాగే ఈ ప్రధాన ప్రాజెక్టుకు అనుబంధంగా వచ్చే ఇతర యూనిట్ల ద్వారా రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 400 ఎకరాలు కేటాయించింది. వీటితో పాటు కర్నూలు జిల్లాలో నిర్మిస్తోన్న 'డ్రోన్ సిటీ' ద్వారా భారతదేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఎఎంసీఏ ప్రాజెక్టుతో పాటు డిఫెన్స్ రంగానికి చెందిన 4 ప్రాజెక్టులు, 8 డ్రోన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఈ పన్నెండు ప్రాజెక్టుల ద్వారా రూ.4145 కోట్ల పెట్టుబడులు, 6,071 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. వీటిల్లో మడకశిరలో రెండు ప్రాజెక్టులు, దొనకొండ, నెల్లూరుల్లో ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మిగిలిన 8 డ్రోన్ ప్రాజెక్టులు కర్నూలు జిల్లాలోని డ్రోన్ సిటీలో నిర్మాణాలు చేపట్టనున్నాయి.ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఉదయం 8:15 గంటలకు ఉండవల్లి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 9:45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 10:15 గంటలకు శంకుస్థాపన కార్యక్రమ వేదిక వద్దకు చేరుకుంటారు. ఉదయం 10:15 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఎఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపనతో పాటు వివిధ డిఫెన్స్, డ్రోన్ ప్రాజెక్టులకు భూమి పూజను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి సీఎం చంద్రబాబు చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2:20 గంటలకు తిరిగి అమరావతి చేరుకుంటారు.



# బుమ్రా సారథ్యంలో అరుదైన మైలురాయి!


ఐపీఎల్ 2026 సీజన్‌లో ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ ఒక విలక్షణమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. గురువారం ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా టాస్ వేయడానికి రావడంతో ఈ అరుదైన ఘనత సాధ్యమైంది. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెన్నునొప్పి కారణంగా ఈ మ్యాచ్‌కు దూరం కాగా, స్టాండ్-ఇన్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వ్యక్తిగత కారణాల వల్ల అందుబాటులో లేడు. దీనితో బుమ్రా తన ఐపీఎల్ కెరీర్‌లో తొలిసారి నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ఒకే సీజన్‌లో ముగ్గురు వేర్వేరు భారతీయ ఆటగాళ్లు (హార్దిక్, సూర్య, బుమ్రా) కెప్టెన్లుగా వ్యవహరించడం ఐపీఎల్ చరిత్రలోనే ఇదే మొదటిసారి. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు కెప్టెన్లను మార్చిన ఐదో జట్టుగా ముంబై నిలిచింది. గతంలో 2008లో ముంబై తరపున హర్భజన్ సింగ్, షాన్ పొల్లాక్, సచిన్ టెండూల్కర్ కెప్టెన్లుగా ఉండగా, ఆ తర్వాత పుణే వారియర్స్ ఇండియా (2013), సన్ రైజర్స్ హైదరాబాద్ (2021), పంజాబ్ కింగ్స్ (2024) ఈ జాబితాలో చేరాయి. అయితే పైన పేర్కొన్న జట్లన్నీ భారతీయులు ఇంకా విదేశీ ఆటగాళ్ల కలయికతో కెప్టెన్లను మార్చగా, ముంబై ఇండియన్స్ మాత్రం ఈసారి ముగ్గురు భారతీయులకే ఆ బాధ్యతలు అప్పగించి సరికొత్త ట్రెండ్ సెట్ చేసింది. వరుస గాయాలు, సీనియర్ల గైర్హాజరీ వల్ల ఈ పరిస్థితి తలెత్తినప్పటికీ, ఇది ముంబై టీమ్ లో ఉన్న లీడర్‌షిప్ డెప్త్‌ను తెలియజేస్తోంది. జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్సీ అరంగేట్రం కోసం చాలా కాలం వేచి చూడాల్సి వచ్చింది. ఏకంగా 156 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన తర్వాత ఆయనకు కెప్టెన్ అయ్యే అవకాశం దక్కింది. లీగ్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన తర్వాత కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్న రెండో ఆటగాడిగా బుమ్రా నిలిచాడు. ఈ లిస్టులో రవీంద్ర జడేజా 200 మ్యాచ్‌లతో టాప్ లో ఉండగా, ఇప్పుడు బుమ్రా మనీష్ పాండే (153), అక్షర్ పటేల్ (148), కీరన్ పొలార్డ్ (137) వంటి దిగ్గజాలను వెనక్కి నెట్టాడు. టాస్ సమయంలో బుమ్రా ఒక చమత్కారమైన కామెంట్ కూడా చేశాడు. ముంబైకి కెప్టెన్ కాకముందే టీమిండియా టెస్ట్ టీమ్ కు కెప్టెన్ అవుతానని ఎప్పుడూ అనుకోలేదని నవ్వుతూ చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హైలైట్ అవుతున్నాయి. ఈ 2026 సీజన్ ముంబై ఇండియన్స్ జట్టుకు అస్సలు కలిసి రావడం లేదు. వరుస ఓటములతో పాటు నాయకత్వ మార్పులు జట్టును ఇబ్బంది పెడుతున్నాయి. టీమ్ లోని కోర్ గ్రూప్ అలాగే ఉన్నా, కెప్టెన్సీలో స్థిరత్వం లేకపోవడం వల్ల మైదానంలో ప్లానింగ్ కష్టంగా మారుతోంది. అయితే ఈ క్లిష్ట పరిస్థితుల్లో కూడా బుమ్రా కెప్టెన్‌గా రావడంతో అభిమానుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ప్రధాన కోచ్ మాహేల జయవర్ధనే పర్యవేక్షణలో ఉన్న ఈ టీమ్, కనీసం మిగిలిన మ్యాచ్‌ల్లో గెలిచి తమ గౌరవాన్ని కాపాడుకోవాలని చూస్తోంది. ప్లేఆఫ్స్ రేసులో నుంచి ఔట్ అయినప్పటికీ, బుమ్రా లాంటి అగ్రెసివ్ బౌలర్ నాయకత్వంలో ముంబై కొత్త ఉత్సాహంతో ఆడుతుందనే అంచనాలు ఉన్నాయి.

## తనను తానే ట్రోల్ చేసుకున్న రోహిత్ శర్మ

రాయ్‌పుర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై గెలిచిన తర్వాత ముంబయి ఇండియన్స్ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మాట్లాడిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇది టీమ్‌మేట్స్‌కు నవ్వు తెప్పించింది. ఇందులో మరీ ముఖ్యంగా రోహిత్ తనను తాను స్వయంగా ట్రోల్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియోను ముంబయి ఇండియన్స్ ఎక్స్‌లో షేర్ చేసింది. మ్యాచ్ అనంతరం జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రోహిత్ మాట్లాడాడు. తనదైన శైలిలో రోహిత్ ఫన్నీ సెటైర్లు పేల్చడం అందరికీ నవ్వు తెప్పించింది. ఈ క్రమంలోనే తన బ్యాటింగ్‌పై తానే ట్రోల్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అందరూ తమవంతు కృషి చేశారని, ఈ విజయం సంపూర్ణ జట్టు కృషి అని అన్నాడు. అయితే తాను ఈ మ్యాచ్‌లో తాను టెస్టు ఇన్నింగ్స్ ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటే, మిగిలిన వాళ్లు తమవంతు సహకారం అందించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని అన్నాడు. 'ఇది అద్భుతమైన విజయం! బ్యాటింగ్‌లో ఇది పూర్తిగా ఒక టీమ్‌గేమ్. నేను మాత్రం నా టెస్టు క్రికెట్‌ను ఆస్వాదిస్తుండగా, జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయడం చాలా



సంతోషంగా ఉంది' అని రోహిత్ అన్నాడు. అయితే రోహిత్ ఈ మ్యాచ్‌లో 26 బంతులు ఆడి కేవలం 25 పరుగులే చేశాడు. స్ట్రైక్ రేట్ 96 మాత్రమే. దీంతో ఇలాంటి స్లో ఇన్నింగ్స్ ఆడినందుకు రోహిత్ తనపై తానే సెటైర్ పేల్చుకున్నాడన్నమాట! ఇది చూసిన నెటిజన్లు 'హిట్‌మ్యాన్ తనను తానే ట్రోల్ చేసుకుంటున్నాడు' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 201 పరుగుల లక్ష్యాన్ని ముంబయి 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తిలక్ వర్మ (75 పరుగులు, 33 బంతుల్లో), రికెల్టన్ (48 పరుగులు, 23 బంతుల్లో), విల్ జాక్స్ (25 పరుగులు, 10 బంతుల్లో) రఫ్ఫాడించగా, రోహిత్ శర్మ (25 పరుగులు, 26 బంతుల్లో), రూథర్‌ఫోర్డ్ (20 పరుగులు, 21 బంతుల్లో) రాణించి జట్టు విజయంలో తలో చేయి వేశారు. బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ 4, దీపక్ చాహర్, కార్బిన్ బోశ్, రాజ్ బవ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.




## గాయంతో జేమీ ఓవర్టన్ అవుట్..

### యువ ఆల్రౌండర్ డియాన్ ఫారెస్టర్ రాక

ఐదుసార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుత 2026 సీజన్‌లో గాయాల సమస్యలతో సతమతమవుతోంది. ఈ క్రమంలోనే జట్టులో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. ఈ సీజన్‌లో టీమ్ తరపున సెకండ్ హయ్యెస్ట్ వికెట్ టేకర్ గా ఉన్న ఇంగ్లాండ్ స్టార్ జేమీ ఓవర్టన్ కుడి తొడ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఓవర్టన్ స్థానంలో సౌతాఫ్రికాకు చెందిన యువ ఆల్రౌండర్ డియాన్ ఫారెస్టర్‌ను సీఎస్కే మేనేజ్మెంట్ గురువారం ఒప్పందం చేసుకుంది. ఫారెస్టర్‌ను రూ. 75 లక్షల బేస్ ప్రైస్ కింద ఐపీఎల్ బృందంలోకి చేర్చుకున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. 32 ఏళ్ల జేమీ ఓవర్టన్ ఈ సీజన్‌లో చెన్నై విజయాలో చాలా కీలక పాత్ర పోషించాడు. ఆడిన 10 మ్యాచ్‌ల్లో ఏకంగా 14 వికెట్లు తీయడమే కాకుండా బ్యాటింగ్‌లో కూడా 136 పరుగులు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో 45 యావరేజ్ తో వెయ్యికి పైగా పరుగులు చేసిన రికార్డు అతనికి ఉంది. టీ20ల్లో 140కి పైగా స్ట్రైక్ రేట్ తో బ్యాటింగ్ చేయగలడు. మే 11న లక్నోతో జరిగిన మ్యాచ్‌లో 3/36 వికెట్లతో చెలరేగి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కూడా అందుకున్నాడు. అయితే గాయం తీవ్రత పెరగడంతో తదుపరి చికిత్స కోసం ఓవర్టన్ తన స్వదేశమైన ఇంగ్లాండ్‌కు బయలుదేరాడు. ఒక మంచి ఫామ్ లో ఉన్న ఆల్రౌండర్ ను కోల్పోవడం సీఎస్కే కు తీరని లోటు అని చెప్పవచ్చు. ఓవర్టన్ ప్లేస్‌లో వస్తున్న డియాన్ ఫారెస్టర్ ఈ ఏడాది మార్చిలోనే న్యూజిలాండ్‌పై సౌతాఫ్రికా తరపున ఇంటర్నేషనల్ డెబ్యూ చేశాడు. ఇప్పటివరకు ఐదు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 83 పరుగులు చేశాడు. రీసెంట్ గా పాకిస్తాన్ సూపర్ లీగ్ లో రావల్పిండిజ్ టీమ్ తరపున ఆడి తన ప్రతిభను చాటుకున్నాడు. ఫారెస్టర్ రాకతో చెన్నై టీమ్ మిడిల్ ఆర్డర్ లో బలం పెరుగుతుందని టీమ్ భావిస్తోంది. సౌతాఫ్రికా ప్లేయర్లు సాధారణంగా ఐపీఎల్ లో మంచి రికార్డు కలిగి ఉంటారు, అదే నమ్మకంతో మేనేజ్మెంట్ ఇతడిని ఎంపిక చేసింది. కొత్త కుర్రాడు సీఎస్కే ఎల్లో జెర్సీలో ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ సీజన్ చెన్నై టీమ్ కు అస్సలు కలిసి రావడం లేదు. వరుసగా ఆటగాళ్లు గాయాల పాలవ్వడం కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పటికే మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ జట్టుకు దూరంగా ఉండగా, టాప్ ఆర్డర్ బ్యాటర్ ఆయుష్ మ్హాత్రే, ఫాస్ట్ బౌలర్ ఖలీల్ అహ్మద్ కూడా గాయాల వల్ల మధ్యలోనే వెనుదిరిగారు. అంతకుముందు రామకృష్ణ ఘోష్ గాయపడటంతో కర్ణాటక ఆల్రౌండర్ మెక్నీల్ నొరోన్హా కూడా జట్టులో చేరాడు. ఇలా ప్రతిసారి ఎవరో ఒకరు తప్పుకోవడంతో టీమ్ కాంబినేషన్ దెబ్బతింటోంది. మే 15న లక్నోలో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌లో చెన్నై ఎలాంటి వ్యూహంతో బరిలోకి దిగుతుందో వేచి చూడాలి. ప్లేఆఫ్స్ రేసులో ఉండాలంటే ఈ మ్యాచ్ చెన్నైకి చాలా కీలకం.

## అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలి

**టీమిండియా మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్**

జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలని టీమిండియా మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ డిమాండ్ చేశాడు. ఈ సీజన్ మొత్తం ఆడకుండా చేయాలని బీసీసీఐని కోరాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ షేర్ చేసిన ఓ వీడియో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోలో తిలక్ వర్మను అర్ష్‌దీప్ సింగ్ కర్రోడా అని సంభోదించాడు. 'అరే ఓ కర్రోడా.. సన్‌స్క్రీన్ రాశావా?'అని అడిగాడు. అంతటితో ఆగకుండగా.. నమన్ ధీర్‌ను అందగాడని అభివర్ణించాడు. ఈ వీడియో నెట్టింట తీవ్ర దుమారం రేపింది. కొందరు ఈ వీడియోను సరదాగా తీసుకొన్న మరికొందరు మాత్రం జాతి వివక్ష వ్యాఖ్యలుగా పేర్కొంటూ అర్ష్‌దీప్ సింగ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా స్పందించిన శివరామకృష్ణన్.. అర్ష్‌దీప్ సింగ్‌పై నిషేధం విధించాలని బీసీసీఐని డిమాండ్ చేశాడు. ఇలాంటి ఘటనలను డ్రెస్సింగ్ రూమ్ జోక్స్‌గా కొట్టిపారేస్తే ఇలాంటి సమస్యలు ఎక్కువ అవుతాయని అభిప్రాయపడ్డాడు. 'తిలక్ వర్మ కెరీర్ ఆరంభంలో ఉంది. కాబట్టి ఈ జాతి వివక్ష వ్యాఖ్యలపై స్పందించడు. కానీ బీసీసీఐ.. ఈ వీడియో ప్రూఫ్‌తో అర్ష్‌దీప్ సింగ్‌పై చర్యలు తీసుకోవచ్చు. ఇది ఏ మాత్రం ఆట కాదు.. ఇదో వృత్తి. జాతి వివక్ష గురించి చెబితే నన్ను ఎవరూ నమ్మలేదు. ప్రతీ ఒక్కరు నన్ను తిట్టడంతో పాటు ట్రోల్ చేశారు. అర్ష్‌దీప్ సింగ్‌ను ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లు ఆడకుండా నిషేధం విధించాలి. నేను మరోసారి ట్రోలింగ్ గురువుతానని తెలుసు. బీసీసీఐ చర్యలు తీసుకుంటుందంటే.. నా పట్ల జాతి వివక్ష వ్యాఖ్యలు చేసి వారి పేర్లు చెబుతాను. వారిపై బీసీసీఐ చర్యలు తీసుకుంటుందా? 'అని శివమరామకృష్ణ వరుస ట్వీట్స్ చేశాడు. ఈ ఘటన బీసీసీఐని ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టింది. ఈ సీజన్ ప్రారంభానికి ముందే ఫ్రాంచైజీలకు ఆఫ్ ఫీల్డ్‌లో ఆటగాళ్ల ప్రవర్తనకు సంబంధించి ఏడు గైడ్‌లైన్స్‌ను బీసీసీఐ జారి చేసింది. ఈ క్రమంలో అర్ష్‌దీప్ సింగ్‌పై చర్యలు తీసుకుంటారా? లేక చూసి చూనట్లు వదిలేస్తారా? అనేది తీవ్ర చర్చనీయాంశమైంది.



## పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ అవకాశాలు క్లిష్టం

కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్ లో గతేడాది ఫైనలిస్టు పంజాబ్ కింగ్స్ మళ్లీ ఉస్సూరుమనిపించింది. వరుసగా ఐదో పరాజయంతో ప్లే ఆఫ్స్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. గురువారం ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్ లో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. అంతకుముందు సొంతగడ్డ ధర్మశాలలో జరిగిన మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 200 పరుగులు చేసింది.

ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్ స్టన్నింగ్ ఫిఫ్టీ (32 బంతుల్లో 587, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం ఛేజింగ్ ను ముంబై చివరి ఓవర్లో ఛేదించింది. 19.5 ఓవర్లలో 4 వికెట్లకు 205 పరుగులు చేసింది. తెలుగు స్టార్ తిలక్ వర్మ సూపర్బ్ ఫిఫ్టీ ( 33 బంతుల్లో 75 నాటౌట్, 6 ఫోర్లు, 6 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్ జాయ్ కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ముంబైకి ఓదార్పు విజయం దక్కింది. మరోవైపు వరుసగా ఐదో పరాజయంతో ప్లే ఆఫ్ అవకాశాలను ప్రమాదంలో పడేసుకుంది పంజాబ్. శుక్రవారం జరిగే మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ తో లక్నో సూపర్ జెయింట్స్ తలపడనుంది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ కు ఓపెనర్లు వెటరన్ రోహిత్ శర్మ (25), ర్యాన్ రికెల్టన్ (23 బంతుల్లో 48, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) శుభారంభం అందించారు. ముఖ్యంగా ఆరంభంలో ఎక్కువగా స్ట్రైక్ తీసుకున్న రికెల్టన్ దడదడలాడించాడు. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగుతూ పంజాబ్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో తొలి వికెట్ కు 61 పరుగుల శుభారంభం దక్కింది. పవర్ ప్లేలో ముంబై 59 పరుగులు చేయగా, అందులో సింహభాగం



రికెల్టన్ చేసినవే కావడం విశేషం. ఇక పవర్ ప్లే ముగిసిన తర్వాత ఓవర్లోనే రికెల్టన్ పెవిలియన్ కు చేరాడు. కాసేపటికే వరుస ఓవర్లలో నమన్ ధీర్ (9), రోహిత్ ఔట్ కావడంతో ముంబై కష్టాల్లో పడింది. పది ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయిన దశలో పీకల్లోతు కష్టాల్లో పడిన దశలో తిలక్ వర్మ, షెర్ఫేన్ రూథర్ ఫర్డ్ (20) ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరంభంలో వేగంగా స్ట్రైక్ రొటేట్ చేస్తూ, పరుగులు సాధించారు. ఈ దశలో నెమ్మదిగా గేర్లు మార్చిన తిలక్.. భారీ సిక్సర్లతో అలరించాడు. యజ్వేంద్ చాహల్ బౌలింగ్ లో 106 మీటర్ల భారీ సిక్సర్ ను తిలక్ బాదడంతో ఏకంగా అది స్టేడియం బయట పడటం విశేషం. ఆ తర్వాత కీలక దశలో సిక్సర్లతో తను అలరించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్ కు 61 పరుగులు జోడించడంతో ముంబై రేసులోకి వచ్చింది. ఈ దశలో రూథర్ ఫర్డ్ ఔటైనా, విల్ జాక్స్ (10 బంతుల్లో 25 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) తో కలిసి తిలక్.. జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ విజయంతో ముంబై టోర్నీలో నాలుగో విజయం సాధించింది. మరోవైపు మ్యాచ్ కు ముందు తిలక్ పై రేసియల్ కామెంట్ చేసిన అర్షదీప్ సింగ్ కు తన బ్యాట్ తో సమాధానమిచ్చాడని ముంబై అభిమానులు అంటున్నారు. మరోవైపు వరుసగా ఐదో పరాజయంతో డీలా పడిన పంజాబ్.. మిగతా రెండు మ్యాచ్ లు గెలిస్తేనే నాకౌట్ దశకు చేరే ప్రమాదంలో పడింది. అజేయ అర్థ సెంచరీతో రాణించిన తిలక్ కే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## ధరల పెంపుపై ఆగ్రహం

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరగనున్న మే 22న సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లను తాజాగా విడుదల చేసింది సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ. అయితే ఈ సన్‌రైజర్స్, బెంగళూరు మ్యాచ్ టికెట్ల వ్యవహారం ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతోంది. విరాట్ కోహ్లీ, ప్యాట్ కమిన్స్ వంటి స్టార్ల పోరును చూడాలని ఆశపడ్డ అభిమానులకు ఇప్పుడు పెద్ద షాకే తగిలింది. మే 22న జరగనున్న ఈ హై-వోల్టేజ్ మ్యాచ్ కోసం నేడు అనగా గురువారం సాయంత్రం 5 గంటలకు టికెట్ల విక్రయాలు ప్రారంభమయ్యాయి. బుకింగ్ ప్రారంభమైన నిమిషాల్లోనే సుమారు 6 లక్షల మంది ఆన్‌లైన్ క్యూలో చేరడం విశేషం. భారీ ట్రాఫిక్ కారణంగా సర్వర్లు మొరాయించడంతో గంటల తరబడి వేచి చూసినా చాలా మందికి టికెట్లు దక్కలేదు. కొద్దిసేపటికే 'సోల్డ్ ఔట్' బోర్డు కనిపించడంతో ఫ్యాన్స్ అవాక్కయ్యారు. ఈ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఫ్రాంచైజీ టికెట్ల ధరలను భారీగా పెంచేసింది. దీనిపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మ్యాచ్‌లో రూ. 750 గా ఉన్న కనీస టికెట్ ధరను ఈసారి రూ. 1,950కి పెంచారు. సామాన్య అభిమానులకు భారంగా మారేలా ఇతర గ్యాలరీల ధరలను కూడా భారీగా పెంచడంపై సోషల్ మీడియాలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. టికెట్ల కేటాయింపులో పారదర్శకత లేదని, అంతర్గతంగా భారీగా అక్రమాలు జరుగుతున్నాయని క్రీడా ప్రేమికులు మండిపడుతున్నారు.

## #RAPO23 నుంచి స్టైలిష్ పోస్టర్‌తో 'వీర' పాత్ర పరిచయం

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లో మరో కీలక అడుగు వేయబోతున్నారు. నటుడిగా తన వైవిధ్యాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూ వచ్చిన రామ్, గత చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో తొలిసారి లిరిసిస్ట్‌గా మారి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాదు, గాయకుడిగానూ తన వాయిస్ ని వినిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు తన 23వ చిత్రం #RAPO23తో దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం స్టైలిష్ సైకాలజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. తెలుగు సినిమాలో అరుదుగా కనిపించే ఈ జానర్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. #RAPO23 చిత్రాన్ని కొత్తగా శ్రీకారం చుట్టిన 'రాపో సినిమాటిక్స్' బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. ఈ చిత్రంతో రామ్ పోతినేని... నటుడి నుంచి దర్శకులుగా మారిన సీనియర్ ఎన్టీఆర్, కృష్ణ, పవన్ కళ్యాణ్ వంటి స్టార్స్ జాబితాలో చేరడం విశేషం. మేకర్స్ విడుదల చేసిన బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో రామ్ పోషిస్తున్న 'వీర' పాత్రను పరిచయం చేశారు. లెదర్ జాకెట్‌లో వెనుక నుంచి కనిపిస్తున్న రామ్ లుక్ డార్క్, ఇంటెన్స్, రగ్గడ్ వైబ్‌ను క్రియేట్ చేస్తోంది. అతని స్టైలిష్ V-కట్ హెయిర్‌స్టైల్ పాత్రలోని అగ్రెసివ్ యాటిట్యూడ్‌ను ప్రతిబింబిస్తోంది. పోస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తున్న ఎరుపు రంగు "V" అక్షరం... 'వీర'తో పాటు తిరుగుబాటు, ఆధిపత్యానికి సంకేతంగా నిలుస్తోంది. ఇరువైపులా కనిపించే స్కైస్క్రేపర్స్ క్రైమ్‌తో నిండిన వాతావరణాన్ని సూచిస్తున్నాయి. "ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్" అనే ట్యాగ్‌లైన్ 'వీర' పాత్రలో రామ్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని అవతార్‌లో కనిపించనుండగా,



ఒంటరితనం, మానసిక సంఘర్షణలతో నిండిన పాత్రను సూచిస్తోంది. దర్శకుడిగా రామ్ పోతినేని స్వయంగా రూపొందించిన కథతో తెరకెక్కుతున్న #RAPO23 ఒక కొత్త తరహా అనుభూతిని ఇవ్వబోతోంది. పోస్టర్ నుంచే ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుండగా, ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## టాలీవుడ్‌లో ప్రత్యేకత చాటుకున్న 'M4M' మూవీ

సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ అంటేనే ఒక ప్రత్యేక క్రేజ్ ఉంటుంది. ఇప్పటివరకు రాని ఒక వినూత్నమైన 'సైకాలజికల్ క్రైమ్ థ్రిల్లర్' సబ్జెక్టుతో ప్రేక్షకుల ముందుకు వచ్చి, అందరినీ ఆకట్టుకుంటోంది 'M4M' (Motive for Murder). గత వారం విడుదలైన ఈ చిత్రం రెండవ వారం కూడా బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. అంతేకాకుండా, IMDb, BookMyShow వంటి ప్లాట్‌ఫామ్‌లలో టాప్ రేటింగ్స్‌ను సొంతం చేసుకుంటోంది. సరికొత్త కాన్సెప్ట్, థ్రిల్లింగ్ స్క్రీన్‌ప్లే, ఉత్కంఠభరిత కథనంతో రూపొందిన ఈ సినిమా టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. మోహన్ మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై, McWin Group USA సహకారంతో తెరకెక్కిన ఈ చిత్రానికి మోహన్ వడ్లపట్ల దర్శకత్వం వహించారు. డెబ్యూ డైరెక్టర్‌గా ఆయన చూపించిన మేకింగ్ స్టైల్, సస్పెన్స్‌ను నడిపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ, "ప్రేక్షకులు సినిమా కాన్సెప్ట్‌ను, స్క్రీన్‌ప్లేను ఆదరిస్తుండటం చాలా ఆనందంగా ఉంది. ప్రతి ఒక్కరి నుంచి వస్తున్న స్పందన మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది" అని తెలిపారు. ఇక ఈ చిత్రంలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ 'రాధా' పాత్రలో నటించిన అమెరికన్ నటి Heroine Jo Sharma తన తొలి తెలుగు చిత్రంతోనే విశేష ప్రశంసలు అందుకుంటోంది. భావోద్వేగాలు, ఉత్కంఠ, ధైర్యసాహసాలను సమపాళ్లలో ప్రదర్శిస్తూ ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే సీనియర్ నటుడు శుభలేఖ సుధాకర్ తన అనుభవంతో సినిమాకు మరింత బలం చేకూర్చారు. డెబ్యూ మ్యూజిక్ డైరెక్టర్ ఇస్సాయి పెట్టె అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ప్రతి సన్నివేశంలోనూ థ్రిల్లింగ్ ఫీల్‌ను పెంచుతూ ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేసింది. నగరంలో వరుసగా జరుగుతున్న హత్యలు... ప్రతి హత్య అనంతరం మృతదేహాలను ప్రసిద్ధ పెయింటింగ్స్ తరహాలో అమర్చే సీరియల్ కిల్లర్... అతడిని ఛేదించేందుకు ACP కృష్ణ, జర్నలిస్ట్ రాధా చేసే దర్యాప్తు... ఈ ఆసక్తికర అంశాలతో సినిమా ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. "సీరియల్ కిల్లర్ ఎవరు?" అనే ప్రశ్నను మొదటి సన్నివేశం నుంచే ప్రేక్షకుల మనసుల్లో నాటుతూ క్లైమాక్స్ వరకు సస్పెన్స్‌ను నిలబెట్టడం చిత్రానికి ప్రధాన బలంగా మారింది. సస్పెన్స్, మిస్టరీ, సైకాలజికల్ ఎలిమెంట్స్ సమ్మేళనంగా రూపొందిన 'ఎం4ఎం – Motive for Murder' త్వరలోనే ఒక ప్రముఖ OTT ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుందని చిత్రయూనిట్ వెల్లడించింది.

## ఎట్టకేలకు థియేటర్లలోకి కురుప్ప

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన భారీ చిత్రం 'కరుప్పు' విడుదలకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగాయి. గత కొన్ని రోజులుగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న అనిశ్చితి అభిమానులను, నిర్మాతలను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అయితే అన్ని సమస్యలు సద్దుమణగడంతో




సినిమా ప్రపంచవ్యాప్తంగా మే 15, శుక్రవారం థియేటర్లలో సందడి చేసింది. తెలుగులో ఈ సినిమా 'వీరభద్రుడు' పేరుతో విడుదల అవుతోంది. సినిమా విడుదల సందర్భంగా సూర్య అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డియర్ అల్.. మాతో ఉన్నందుకు ధన్యవాదాలు. ఈరోజు నుంచి 'కరుప్పు', 'వీరభద్రుడు' థియేటర్లలో విడుదల అవుతున్నాయి' అంటూ ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ సందేశం అభిమానుల్లో ఆనందాన్ని నింపుతోంది. మొదట ఈ చిత్రాన్ని మే 14న విడుదల చేయాలని భావించినప్పటికీ, చివరి నిమిషంలో కొన్ని కారణాలతో విడుదల వాయిదా పడింది. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రేక్షకులకు క్షమాపణలు తెలిపింది. కొన్ని ప్రయాణాలు కాలాన్ని మాత్రమే కాదు.. మనసును కూడా పరీక్షిస్తాయి. సినిమా కోసం ఎదురుచూసిన ప్రతి ఒక్కరికీ మేము క్షమాపణలు చెబుతున్నాం. విడుదలలో జరిగిన ఆలస్యం మమ్మల్ని కూడా బాధించింది. అయినప్పటికీ మాపై మీరు చూపించిన నమ్మకం, ప్రేమ మాకు ఎంతో బలం ఇచ్చాయి అంటూ నిర్మాణ సంస్థ భావోద్వేగ ప్రకటన విడుదల చేసింది. అలాగే 'కరుప్పు' కేవలం తమ సినిమా మాత్రమే కాదని, ప్రేక్షకులందరి కథ అని పేర్కొంది. ఎన్నో కష్టాలు, నిద్రలేని రాత్రుల తర్వాత ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపింది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో విడుదల ఆగిపోయిన సమయంలో ముంబై, పుణెలోని కొన్ని థియేటర్లలో సినిమా ప్రదర్శన జరిగినట్లు సమాచారం రావడంతో నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సినిమా పైరసీకి గురయ్యే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. సూర్య సరసన త్రిష హీరోయిన్‌గా నటించింది. ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందించారు.



## 'నాగబంధం' నుంచి లీలావతిగా అనసూయ భరద్వాజ్ ఇంటెన్స్ ఫస్ట్ లుక్ రిలీజ్

అభిషేక్ నామా దర్శకత్వంలో, విరాట్ కర్ణ నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసివ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ 'నాగబంధం' సినిమా నుంచి అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. 'లీలావతి' పాత్రలో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, మిస్టీరియస్‌గా కనిపిస్తోంది. సంప్రదాయ తెలుపు చీరలో, ట్రైబల్ జ్యువెలరీతో అనసూయ కనిపించిన తీరు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తోంది. లీలావతి పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉండబోతోందనే ఫీల్ ఈ పోస్టర్‌తోనే స్పష్టమవుతోంది. ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాన్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో 'నాగబంధం' చిత్రం జూలై 3న విడుదల కానుంది.

## పల్లెటూరి ప్రేమకథ దూరదర్శిని


ప్రస్తుత కాలంలో సినిమా విజయాన్ని బడ్జెట్ నిర్ణయించడం లేదు, కేవలం కంటెంట్ మాత్రమే శాసిస్తోంది. బలమైన కథాంశంతో వస్తున్న చిన్న చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధిస్తూ




సంచలనం సృష్టిస్తున్నాయి. సరిగ్గా అదే బాటలో, కేవలం కథనే నమ్ముకుని ఈ వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'దూరదర్శిని'. టైటిల్‌తోనే సగటు ప్రేక్షకుడిలో పాత జ్ఞాపకాలను తట్టిలేపిన ఈ సినిమా, థియేటర్లలో సందడి చేస్తోంది. చిత్ర కథ మట్టపర్రు అనే పచ్చని పల్లెటూరి చుట్టూ తిరుగుతుంది. ఊరిలో కుల రాజకీయాలు, అంతరాలు ఉన్నప్పటికీ.. హరి (సువీక్షిత్), వాణి (గీతికా రతన్) చిన్నప్పటి నుండి ఒకరినొకరు ఇష్టపడతారు. ప్రతి శుక్రవారం దూరదర్శినిలో వచ్చే చిత్రలహరిని చూడటానికి వెళ్లే క్రమంలో వీరి మధ్య ప్రేమ చిగురిస్తుంది. అయితే, ఊరిలో పలుకుబడి ఉన్న వ్యక్తి, వాణి అన్నయ్య అయిన పరశురామ్‌తో హరికి గొడవ జరగడంతో వీరి ప్రేమాయణం మలుపు తిరుగుతుంది. పేదవాడైన హరి, పెత్తందారీ కుటుంబానికి చెందిన వాణిని ఎలా దక్కించుకున్నాడు? వీరి ప్రేమ కథకు కుల సమీకరణాలు ఎలా అడ్డంకిగా మారాయి? అనేదే ఈ సినిమా ఇతివృత్తం. ఒర్శకుడు కార్తికేయ 1990ల నాటి గ్రామీణ వాతావరణాన్ని, అప్పటి మనుషుల భావోద్వేగాలను అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించారు. ముఖ్యంగా 'దూరదర్శిని' అనేది కేవలం టైటిల్ మాత్రమే కాకుండా, కథలో ఒక కీలక పాత్రలా సాగుతుంది. ప్రథమార్థంలో హీరో హీరోయిన్ల మధ్య సాగే సన్నివేశాలు నెమ్మదిగా సాగినప్పటికీ, పల్లెటూరి అందాలు, అల్లరి చిల్లర కామెడీ ప్రేక్షకులను అలరిస్తాయి. విరామ సమయానికి కథలో వేగం పుంజుకుంటుంది. ద్వితీయార్థంలో కుల వివక్ష వల్ల కలిగే పరిణామాలు, భావోద్వేగపూరితమైన సన్నివేశాలు సినిమాను నిలబెట్టాయి. ÷–లకైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.నూతన నటీనటులైన సువీక్షిత్, గీతికలు తమ నటనతో ఆకట్టుకున్నారు. తొలి చిత్రమే అయినా ఎంతో పరిణతితో నటించి పాత్రలకు ప్రాణం పోశారు. ఇక హీరో స్నేహితులుగా నటించిన భద్ర, బలరామ్ గ్యాంగ్ పండించిన కామెడీ అక్కడక్కడా నవ్వులు పూయిస్తుంది. విలనిజం పండించిన పరశురాం తన గంభీరమైన నటనతో మెప్పించారు.

## పర్సెంటీజీ విధానంపై 15మందితో కమిటీ

సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలకీ మధ్య సినిమాల ప్రదర్శనల విషయంలో వివాదం నెలకొన్న క్రమంలో ఓ అంగీకారానికి వచ్చారు. దీనిపై వాణిజ్య మండలి అధ్యక్షుడు డి.సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం థియేటర్ యాజమాన్యాలు, నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం తీసుకుంది. పర్సంటేజీ విధానంపై కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. 15 మందితో కమిటీ వేయనున్నట్లు వెల్లడించింది. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై సి.కల్యాణ్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. సినిమాల విడుదలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టంచేశారు. కమిటీలో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు ఎగ్జిబిటర్లు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు ఉంటారని ఆయన తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో నిర్మాతలు అల్లు అరవింద్, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, రవి కిషోర్, మైత్రీ రవి, సి.కల్యాణ్, దిల్ రాజు, రాధా మోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, నాగవంశీ, ఎస్ కె ఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని దాదాపు 50 మంది నిర్మాతలు పాల్గొన్నారు. ఎగ్జిబిటర్స్ తరపున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.



## "స్పైడర్-మ్యాన్: బ్రాండ్ న్యూ డే" కొత్త పోస్టర్ విడుదల

హాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం స్పైడర్ –మన్ : బ్రాండ్ న్యూ డే వినుండి కొత్త పోస్టర్‌ను మేకర్స్ విడుదేల చేశారు. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల



నుంచి అద్భుతమైన స్పందన లభించగా, ఇప్పుడు ఈ కొత్త పోస్టర్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ చిత్రం 2026 జూలై 31న ఇండియా లో ఇంగ్లీష్, హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. కొత్త పోస్టర్‌లో టామ్ హోలాండ్ పోషిస్తున్న పీటర్ పార్కర్ తన హూడీ కింద స్పైడర్–మ్యాన్ సూట్‌ను దాచుకుని కనిపిస్తున్నాడు. "ప్రపంచం పీటర్ పార్కర్‌ను మర్చిపోయినా... అతడు తన బాధ్యతను మాత్రం మర్చిపోలేదు" అనే భావాన్ని ఈ పోస్టర్ బలంగా ప్రతిబింబిస్తోంది. తన నగరాన్ని రక్షించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉన్న స్పైడర్–మ్యాన్ మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు వస్తున్నాడని ఈ పోస్టర్ సూచిస్తోంది. స్పైడర్ మ్యాన్ – నో వే హోమ్ ఘన విజయానికి నాలుగేళ్ల తర్వాత, ఈ చిత్రం పీటర్ పార్కర్ జీవితంలో కొత్త అధ్యాయాన్ని చూపించనుంది. ప్రపంచం తనను గుర్తించని పరిస్థితుల్లో ఒంటరిగా జీవిస్తున్న పీటర్, న్యూయార్క్ నగరాన్ని రక్షించడమే తన ధ్యేయంగా మారుతుంది. కానీ కొత్త నేరాల పరంపరతో పాటు అతని జీవితాన్ని కుదిపేసే శక్తివంతమైన శత్రువు రంగంలోకి దిగడంతో కథ మరింత ఉత్కంఠభరితంగా సాగనుంది. సోనీ పిక్చర్స్ సంస్థ ఇండియా ￼ ఈ చిత్రాన్ని భారతదేశవ్యాప్తంగా అన్ని ప్రీమియం ఫార్మాట్లలో విడుదల చేయనుంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/26/A2380